
ఆదివారం 28 జూన్ 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



## మీ త్యాగాలకు న్యాయం గ్యారెంటీ

భావోద్వేగభరితంగా వెలిగొండ నిర్వాసితులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి

- వివరాలు 3 లో..

# వెలిగొండ.. అభివృద్ధికి వెండికొండ!

- తలరాతను మార్చే ప్రాజెక్టులో నిర్వాసితులకు న్యాయం
- ప్రాజెక్టును పూర్తి చేస్తాం... నాదీ గ్యారెంటీ
- ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టులు పూర్తి చేస్తా
- వెలిగొండ ఫేజ్-1 ద్వారా ఈ సీజన్‌లోనే నీళ్లు
- ప్రాజెక్టుపై గత పాలకులవి పచ్చి మోసాలు
- కులాలను కాదు, కూటమి ప్రగతి చూడండి
- రైతులు, నిర్వాసితులతో భేటీలో సీఎం చంద్రబాబు
- 2,351మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు
- ఆర్ అండ్ ఆర్ నిధుల చెక్కులిచ్చిన ముఖ్యమంత్రి
- ప్రాజెక్టు పనుల వేగంపై మంత్రి నిమ్మలకు కితాబు


2





ప్రాజెక్టులకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులు, నిర్వాసితులు ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తాము పాలన చేపడుతున్నామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ అంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును అందించారు.

# సంపూర్ణంగా సంజీవని!



- ఆగస్టు 15నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసమే.. ఈ పథకం
- టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే
- నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష
- కాలర్ ఎగరేసి చెప్పకునేలా అమరావతి నిర్మాణం
- నిర్మాణ వేగం ఓర్వలేకే రాజధానికి వైసీపీ కూతలు
- ఛీ ఛీ అంటున్నా... మావిగన్ పట్టుకుని వేలాడుతున్నారు
- వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్‌తో సమాజం, ఆడబిడ్డకు రక్షణ లేదు
- గిద్దలూరు కిష్టంశెట్టిపల్లెలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన ముఖ్యమంత్రి

4

## నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్‌పోలియో



- ఉండవల్లిలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- వైజాగ్‌లో హాజరుకానున్న వైద్యఆరోగ్య మంత్రి
- 49.20 లక్షల మందికి చుక్కలే లక్ష్యం
- ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు

8

## విధివిధానాలు ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలా?

- నోరుంది కదా అని మాట్లాడుతున్నారు
- మీలో రియలైజేషన్ వస్తుందో లేదో చూస్తాం
- తిట్టినా.. తిట్టకున్నా మేం బలపడటం గ్యారంటీ
- వైసీపీ నేతలకు పవన్‌కళ్యాణ్ హితవు

5



## గొడ్డలి పార్టీకి కర్మ రిటర్న్స్

- అందుకే అమరావతి రైతుల చేతిలో భంగపాటు
- గులకరాయి, కోడికత్తి డ్రామాలకు కాలం చెల్లింది
- అలజడులు సృష్టిస్తామంటే ఊరుకునేది లేదు
- రాజధానిలో పెయిడ్ డ్రామాలు మానుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హితవు



9



## బయటపడ్డ భూమన అనుచరుల అరాచకం

- ఫేస్‌బుక్ కామెంట్ పెట్టాడని యువకుడి కిడ్నాప్
- గత ప్రభుత్వంలో అరాచక పర్వం
- నాలుక కోసి.. నరాలు కట్‌చేసి హత్యాయత్నం
- సజ్జల ఆదేశాలతో బాధితుడిపైనే ఎదురు కేసు
- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అనుచరుల భూదందా
- న్యాయం చేయాలని ప్రజావినతుల్లో గోడు
- అర్జీలు స్వీకరించిన హోంమంత్రి వంగలపూడి అనిత

7

## రాజధాని ద్రోహి జగన్‌రెడ్డి గో బ్యాక్

అమరావతి రైతుల నినాదాలు - వైసీపీ నాయకులకు భంగపాటు




8

# వెలిగొండ.. అభివృద్ధికి వెండికొండ!

- తలరాతను మార్చే ప్రాజెక్టులో నిర్వాసితులకు న్యాయం
- ప్రాజెక్టును పూర్తి చేస్తాం... నాదీ గ్యారెంటీ
- ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టులు పూర్తి చేస్తా
- వెలిగొండ ఫేజ్-1 ద్వారా ఈ సీజన్‌లోనే నీళ్లు
- ప్రాజెక్టుపై గత పాలకులవి పచ్చి మోసాలు
- కులాలను కాదు, కూటమి ప్రగతి చూడండి
- రైతులు, నిర్వాసితులతో భేటీలో సీఎం చంద్రబాబు
- 2,351మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు
- ఆర్ అండ్ ఆర్ నిధుల చెక్కులిచ్చిన ముఖ్యమంత్రి
- ప్రాజెక్టు పనుల వేగంపై మంత్రి నిమ్మలకు కితాబు



మార్కాపురం (చైతన్య రథం): ప్రాజెక్టులకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులు, నిర్వాసితులు ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తాము పాలన చేపడుతున్నామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ అంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును అందించారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర... మార్కాపురం జిల్లా అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యలున్నాయి. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు. ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కృష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985లోనే ఆలోచన చేశారు. దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవాళ్లు. వరద వస్తే.. ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం. ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1,932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి. రూ.1,906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం బ్యాంకులకు సెలవులు ఉన్నందున మరో రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి. అయినా వెలిగొండ సహా వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## వెలిగొండతో నాలుగు జిల్లాల తలరాతలు మారతాయి...

"ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేశుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టిగొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపాడు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. కొత్తగా నిర్మించబోయే కలెక్టరేట్ పక్కన కొన్ని గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నాం. కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతోపాటు.. నిర్వాసితుల కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నాం... నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేశాం. నిర్వాసితుల త్యాగం వల్ల 4.47 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయి. 23 లక్షల మందికి తాగునీరు లభిస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1 ద్వారా ఈ సీజన్‌లో నీళ్లను అందిస్తాం. ఫేజ్-1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్-2 కింద 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్ర. ఈ ప్రాజెక్టు లబ్దిదారులతోపాటు.. నిర్వాసితులు కూడా ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. హైదరాబాద్ నగరంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కోట్లాది రూపాయలు గడించారు. అభివృద్ధి చేస్తేనే ఆదాయం వస్తుంది.. వెలిగొండ ప్రాజెక్టు వల్ల నాలుగు జిల్లాల పరిధిలో భూముల ధరలు పెరుగుతాయి... ఆ జిల్లాల తలరాతలు మారతాయి. కరవు జిల్లా పరిస్థితులను అర్థం చేసుకునే కలెక్టరును మార్కాపురానికి నియమించాం. మార్కాపురం జిల్లాలో హార్టికల్చర్ పంటలు వేయాలి. పూర్వోదయ ప్రాజెక్టులో మార్కాపురం జిల్లాను కూడా చేర్చాం. అగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుంది.. యువతకు ఉపాధి కల్పిస్తాం. రామాయపట్నం పోర్టు మార్కాపురానికి సమీపంలో ఉంది.. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి కనెక్టివిటీ పెంచుతాం. మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. టన్నెల్‌లోకి వెళ్తున్నారు.. పుట్టిన రోజు కూడా ఇక్కడే జరుపుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పట్టుదలతో పని చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి ఫేజ్-2 కూడా పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించాం... సీజన్ కాపాడాం. ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి కలిసి కొత్త గేట్లను ప్రారంభించాం. జల వివాదాలకు స్వస్తి పలకాలని నిర్ణయించాం... గంగా-కావేరి నదుల అనుసంధానం జరగాలి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే.. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, వంశధార, పెన్నా, కావేరి నదులు అనుసంధానం అయ్యేందుకు అవకాశం ఉంది. నదుల అనుసంధానంతోపాటు భూగర్భ జలాలు పెంచాలి.. అందుకే జలధార కార్యక్రమం చేపట్టాం. భూగర్భ జలాలు పెరిగితే.. విద్యుత్ భారం తగ్గుతుంది." అని ముఖ్యమంత్రి చెప్పారు.

## గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలి

"గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి... రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు.. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు... అప్పుల భారాన్ని పెంచారు. గడచిన ప్రభుత్వం వెలిగొండ పనులు చేపట్టి ఉంటే నీళ్లు ఎప్పుడో వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకే పెద్ద ఎత్తున పనులు చేపట్టాం. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో డ్రామాలాడారు.. మోసం చేశారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట.. కళ్లార్పకుండా అబద్దాలు చెబుతారు... తేరుకునేలోపే మోసం చేసేస్తారు. మోసాలు ఎలా చేస్తారో.. ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయంపై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియంలో పెట్టాలి. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకే రూ.900 కోట్లు ఖర్చు పెడుతోంది... నిర్మాణానికి రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు.. సొరంగాల్లో తవ్విన మట్టిని కూడా తీయలేదు.. ఫీడర్ కెనాల్ పనులను చేపట్టలేదు. ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని తీయకుండానే జాతికి అంకితం అని మోసం చేశారు. 2014-19 మధ్య కాలంలోనే సొరంగాల పనులు చాలా వరకు పూర్తి చేశాం. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో 7,225 మంది నిర్వాసితులు ఉన్నారు... ప్రతి ఒక్కరి వెనుకా ఓ విషాద గాథ ఉంటుంది. పుట్టిన ఊరు నుంచి వెళ్లిపోవాలంటే చాలా బాధేస్తుంది. ఇంత మంది నిర్వాసితులుంటే... గత ప్రభుత్వం కేవలం 96 మందికి మాత్రమే పునరావాసం ఇచ్చింది. నిర్వాసితుల గోడు వెళ్లబోసుకోవాలని వస్తే కేసులు పెట్టించారు. కానీ మాది ప్రజా ప్రభుత్వం.. ఏ ఒక్కరూ నష్టపోకుండా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఇది నా గ్యారెంటీ. గత ప్రభుత్వం వదిలి పెట్టిన రూ.140 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించాం. ఏ పార్టీ అధికారంలోకి వస్తే మాకేం అవుతుందనే భావనతో ఉండొద్దు.. ప్రజల జీవితాలను విధ్వంసం చేయవచ్చని గత పాలకులు నిరూపించారు. పోలవరం ప్రాజెక్టులో దయాఫ్రం వాల్ పడగొట్టేలా చేశారు. ప్రభుత్వాన్ని నమ్మి అమరావతికి రైతులు భూములిస్తే.. దాన్ని నిర్వీర్యం చేశారు... రాజధాని లేకుండా చేశారు... మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని రాజధానిగా కేంద్రం చట్టం చేస్తే... మావిగన్ అంటున్నారు. రాజధానితో మాకేం పని అని ఇతర ప్రాంతాల వాళ్లు అనుకోవద్దు... రాజధాని లేని రాష్ట్రంగా ఉండడం మంచిదా అని ప్రజలు ఆలోచించాలి. కులం, మతం, ప్రాంతం వంటి వాటి ప్రలోభాలకు గురి కావద్దు... మంచి చెడు ఆలోచించి విశ్లేషించుకుని ఓట్లేయాలి. మార్కాపురాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది... సహకరించే బాధ్యత ప్రజలది.. నన్ను చూడండి.. పార్టీని చూడండి.. ఎన్డీఏను చూసి సహకరించండి. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తాం.. మీ నుంచి సహకారాన్ని కోరుతున్నాం." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీనివాసులు రెడ్డి సహా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.





చైతన్యరథం



# మీ త్యాగాలకు న్యాయం గ్యారెంటీ

- భావోద్వేగభరితంగా వెలిగొండ నిర్వాసితులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- కష్టాలను గుర్తించి... పరిష్కరిస్తుంది చంద్రబాబేనంటూ నిర్వాసితుల కన్నీళ్లు
- పునరావాసం అడిగితే... అరెస్టులు చేశారంటూ నాటి పాలనపై రైతు కన్నెర్ర
- పునరావసంతో పిల్లల భవిష్యత్తుపై భరోసా కలిగిందన్న నిర్వాసితులు
- తమ 30 ఏళ్ల కల నెరవేరుతోందంటూ సంతోషం వ్యక్తం చేసిన రైతులు







యర్రగొండపాలెం (చైతన్య రథం): మార్కాపురం జిల్లా దోర్నాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించడంతోపాటు... ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులు, రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అయితే ఈ సమావేశం ఆసాంతం భావోద్వేగభరిత వాతావరణం మధ్య సాగింది. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు... పునరావాసం విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు నిర్వాసితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పునరావాసం విషయంలో నాటి ప్రభుత్వ వేధింపులను రైతులు, నిర్వాసితులు ఈ సమావేశంలో వివరించారు. పునరావాసం అందించే నిమిత్తం రూ.300 కోట్లు ఇవ్వడానికి స్వయంగా సీఎం రావడంపై సుంకేశుల గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం వలీ అనే నిర్వాసితుడు భావోద్వేగానికి గురయ్యారు. తమ బాధలను గుర్తించి పరిష్కారం చూపింది చంద్రబాబే అంటూ ఖాసీం వలీ కన్నీళ్లు పెట్టుకున్నారు. గత పాలకులు పునరావాసం అడిగితే అరెస్టులు చేసి వేధించారంటూ నాటి సంగతులను నిర్వాసితులు గుర్తు చేసుకున్నారు. తమ హక్కులను కాలరాసే విధంగా తమను బంధించారని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు సీఎంకు వివరించారు. పునరావాసం డబ్బులు అందుతుండడంతో తమ పిల్లల చదువు, భవిష్యత్తుపై భరోసా కలిగిందని మరో నిర్వాసితుడు హనుమ ప్రసాద్ చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను చకచకా చేపట్టడం ద్వారా తమ 30 ఏళ్ల కలను సాకారం చేస్తున్నారంటూ కొందరు రైతులు పాదాభివందనం చేసే ప్రయత్నం చేయగా వారిని ముఖ్యమంత్రి నివారించారు. ఆ తర్వాత రైతులు, నిర్వాసితులు మాట్లాడిన అంశాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా.. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే గ్యారెంటీ తనది అంటూ నిర్వాసితులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. నాలుగు జిల్లాల తలరాతలు మార్చేందుకు సహకరించిన నిర్వాసితుల త్యాగానికి తగిన ఫలాలు అందిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 7,225 మంది నిర్వాసితులు ఉంటే కేవలం 96 మందికే ఆర్ అండ్ ఆర్ నిధులను గత ప్రభుత్వం అందించింది. శనివారం నాడు 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల మేర ఆర్ అండ్ ఆర్ నిధులు సీఎం చంద్రబాబు అందించారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల రైతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రైతుల మధ్యనే కూర్చొని ముఖాముఖిలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.





చైతన్యరథం

# సంపూర్ణంగా సంజీవని!



మార్కాపురం (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులతో కూడిన సంజీవని ప్రాజెక్టును అమలు చేయనున్నట్టు వెల్లడించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టిపల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ కేర్ వరకూ వైద్య సేవలు అందేలా ఈ సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ ఉంటుందని సీఎం వివరించారు. ప్రజలందరికీ సంపూర్ణ వైద్య సేవలు అందించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ వరకూ మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానిస్తామని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "సంజీవని ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్ బుకింగ్, ఆరోగ్యంపై ఫాలోఅప్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సేవలు అందుతాయి. సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.61 కోట్ల మందికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహించాం. డిస్ట్రిక్ట్, స్టేట్, విలేజ్ డిసీజ్ ప్రొఫైల్స్‌ను విశ్లేషిస్తాం. సంజీవని లాంటి కార్యక్రమాల అమలుకు ప్రజల నుంచి కూడా పూర్తి మద్దతు కావాలి. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యం కాపాడుకోవాలి. యోగా, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరుతున్నాను. తాజా ఆహారం, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటివి తీసుకోవాలి. ఆహారంలో కార్బొహైడ్రేట్స్ తగ్గించాలి. పేదల సంక్షేమంపై ఉన్న ఆలోచనతోనే పథకాలు అందిస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత ప్రయాణం, దీపం 2.0 లాంటి పథకాలు మహిళలకే అమలు చేస్తున్నాం. అన్నదాతకు అండగా ఉండేలా మొదటి విడత నిధులు విడుదల చేశాం. వచ్చే నెలలో తల్లికి వందనం పథకం కింద నిధులు తల్లుల ఖాతాలో జమ చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల పరపతి పెరిగింది. చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా రైతుల కోసం ఓ యాప్ తీసుకువచ్చాం. మన దగ్గర నుంచి ఎగుమతి చేసిన మిరపలో క్రిమి సంహారకాలు ఉన్నాయని చైనా వెనక్కు తిప్పి పంపింది. అందుకే ప్రకృతి సేద్యం చేసి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేద్దాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

- ఆగస్టు 15నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసమే.. ఈ పథకం
- టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే
- నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష
- కాలర్ ఎగరేసి చెప్పకునేలా అమరావతి నిర్మాణం
- నిర్మాణ వేగం ఓర్వలేకే రాజధానికి వైసీపీ కూతలు
- ఛీ ఛీ అంటున్నా... మావిగన్ పట్టుకుని వేలాడుతున్నారు
- వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్‌తో సమాజం, ఆడబిడ్డకు రక్షణ లేదు
- గిద్దలూరు కిష్టంశెట్టిపల్లెలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన ముఖ్యమంత్రి

## జెన్ జీ కంటే వేగంగా ఆలోచన

"ప్రస్తుత జెన్ జీ, జెన్ ఆల్ఫా వర్గానికి చెందిన యువతలానే నేనూ జెన్ జీని. భవిష్యత్తును ముందే ఊహించి దానికి అనుగుణంగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాను. ఏఐ, క్వాంటం టెక్నాలజీల్లో మన యువత నిష్ణాతులు కావాలి. చిన్న కుటుంబాలు భారతదేశ సంప్రదాయం కాదు, ఉమ్మడి కుటుంబమే ఆనందదాయకం అని గుర్తించాలి. జనాభా నిర్వహణ ఇప్పుడు తక్షణ అవసరంగా మారింది. ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. ప్రపంచంలోని కొన్ని దేశాలు జనాభా లేక ఇబ్బందులు పడుతున్నాయి. అమరావతి రాజధాని నగరాన్ని హరిత నగరంగా, నివాసయోగ్య ప్రాంతంగా నిర్మిస్తున్నాం. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసి చెప్పేలా అభివృద్ధి చేస్తాం. గొడ్డలి పార్టీ ముందు అమరావతిని అంగీకరించి ఆ తర్వాత మూడు ముక్కల ఆట ఆడింది. ఐదేళ్ల పాటు తాత్సారం చేసిన గొడ్డలి పార్టీ అభివృద్ధిని ఆమడ దూరం పెట్టింది. గొడ్డలి పార్టీ నేతలు మోసాలు చేయడంలో దిట్టలు. అమరావతి చట్టం కూడా అయిపోయాక మావిగన్ అంటున్నారు. మావిగన్ అంటే ఎవరికీ అర్థం కాదు. అందరూ ఛీ కొడుతున్నారు. బాధ్యత లేని రాజకీయ పార్టీ ప్రజల్ని, వారి నిర్ణయాన్ని అపహాస్యం చేస్తోంది." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష

"మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత కూడా నాకే వచ్చింది. రూ.3,900 కోట్ల పనులు చేయాల్సి ఉన్నా గత పాలకుడు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాసం కింద నేడు రైతులకు రూ.300 కోట్లు ఇచ్చాం. త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తాం. రెండు దశలలో 4 లక్షల ఎకరాలకు పైచిలుకు ప్రాంతంలో ఆయకట్టుకు నీరు అందుతుంది. రామాయపట్నం పోర్టు కూడా త్వరలోనే పూర్తై పరిశ్రమలు వస్తాయి. ఇక్కడి యువతకు స్థానికంగానే ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నాం. ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా రాయలసీమను హార్టీకల్చర్ హబ్ చేస్తాం. వివిధ రకాల పండ్ల తోటలతోపాటు వాణిజ్య పంటలు పండించేందుకు వీలుగా కార్యాచరణ చేపడతాం. తుంగభద్ర గేటు కొట్టుకుపోతే వెంటనే స్పందించి ఆ గేటు బిగించి 33 కొత్త క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశాం. ఏపీ, తెలంగాణ, కర్ణాటక కలిసి రైతుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాం. గంగా-కావేరి నదుల అనుసంధానం జరిగేలా గోదావరి-నల్లమల సాగర్ లింక్‌తో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నుంచి కావేరి నది వరకూ నీటిని తీసుకెళ్తాం. నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష. ఈ ప్రాజెక్టుల విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం కావాలి. ఎల్ నినో వల్ల వర్షాలు లేక నదుల్లో నీటి ప్రవాహాలు తగ్గాయి. పర్యావరణం, నీటిని పొదుపుగా వాడుకోవాలి. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చడమే ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం. చెక్ డ్యామ్‌లు కడితే ఎగతాళి చేశారు. సాగునీరు ఇచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు నడపాలన్నదే నా లక్ష్యం. జలధార ద్వారా భూగర్భజలాలు పెంచి అన్నమయ్య జిల్లా విజయం సాధించింది. ఇంత చేస్తుంటే కులం, మతం, ప్రాంతం అని కొందరు కుట్రలు చేస్తున్నారు. సమర్థవంతమైన ప్రభుత్వమే ప్రజల సమస్యల్ని పరిష్కారం చేయగలుగుతుందని" సీఎం స్పష్టం చేశారు.

## రాజధాని నిర్మాణం అడ్డుకోడానికే వైసీపీ కుతంత్రాలు

"గత పాలనలో విధ్వంసంతో నలిగిపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసం, కనీసం నలుగురు వ్యక్తులు కలిసి మాట్లాడుకోలేని దుస్థితి గత పాలనలో ఉంది. నేడు మనం అంతా స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నాం. ఇదే నాటికి నేటికి ఉన్న తేడా. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు రాబందుల తరహాలో వేచి ఉన్నారు. ఏమీ జరక్కపోయినా ఏవో నేరాలు చేసి ఎవరో ఒకరిపై నెట్టేసి గొడ్డలి పార్టీ డైవర్ట్ చేస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేశారు. హోం మంత్రి అనిత మేకప్ గురించి ఆమెను అవమానించేలా కొందరు వ్యక్తులు మాట్లాడుతున్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి ఆ పార్టీ వారికి సిగ్గు అనిపించడం లేదు. పోలీసులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవన్నీ చూస్తూ ఊరుకోం. అమరావతిపై కుట్ర చేయడానికే వైసీపీ నేతలు అక్కడికి వెళ్లారు. రాజధాని రైతుల్ని రెచ్చగొట్టడానికే అమరావతికి వెళ్లారు. రాజధాని నిర్మాణం జరుగుతుంటే దాన్ని అడ్డుకోడానికే వైసీపీ నేతలు రాజధాని ప్రాంతానికి వెళితే రైతులు వారిని అడ్డగించారు. గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత దానికి లేదు. దేవాలయాలపై దాడులు చేసిన వ్యక్తులు ఇప్పుడు దేవాలయాల సందర్శనకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. కళ్లార్పకుండా అబద్ధాలు, మోసాలు చేస్తున్నారు. నేరాలు చేస్తారు, ఘోరాలు చేస్తారు. నేరస్థులైన రాజకీయ పార్టీలు, నేతలతో నేను పోరాడలేదు. ఆ పార్టీది పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. గంజాయి బ్యాచ్, రౌడీ బ్యాచ్‌ను తయారు చేసి అరాచకం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది." అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం మార్కాపురం జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలకు సంబంధించిన రిపోర్టు కార్డును సీఎం ప్రజలముందు ఉంచారు. ప్రజామోదం లేని పాలనను సహించేది లేదని స్పష్టం చేశారు. పౌర సేవలను అందించే అంశంపై ఆకస్మిక తనిఖీలకూ వస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.





# రైతు కంట కృష్ణమ్మ చెమ్మ!



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వెలిగొండ ప్రాజెక్టు ప్రాంత రైతాంగం ఘన స్వాగతం పలికింది. శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించిన సీఎం చంద్రబాబు, దోర్నాల మండలం గంటావానిపల్లిలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని స్వయంగా పరిశీలించారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి రైతులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పొలాల మధ్యనే సీఎంతో రైతాంగం జరిపిన సమావేశం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. ప్రాజెక్టుకు సంబంధించిన పనులు జరుగుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం రైతులు, నిర్వాసితులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును అందించారు. 30 ఏళ్ల కల వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రైతులు కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురయ్యారు. రైతు కంట కృష్ణమ్మ చెమ్మ జలజలాకారినట్టు అనిపించింది. నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండగా సీఎం అభివర్ణించారు. నీళ్లు లేక ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ నీరు తాగుతున్నారని, కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ప్రాజెక్టులకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులు, నిర్వాసితులు ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వ బాధ్యతగా స్పష్టం చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని.. వెలిగొండ ప్రాజెక్టు రైతులు రాష్ట్రానికి ఆదర్శమని ముఖ్యమంత్రి కొనియాడారు. గత ప్రభుత్వం 'వెలిగొండ'కు అన్యాయం చేసిందని ఆగ్రహిస్తూ.. టన్నెల్–2లో యంత్రం చిక్కుకున్నా తొలగించకుండా ప్రారంభోత్సవం చేసిన గత ప్రభుత్వంపై సీఎం తీవ్రంగా ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే దశాబ్దాల కరవు పోతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ అని ప్రకటించారు. వెలిగొండ ప్రాజెక్టు కింద సాగు చేసే రైతాంగం, నిర్వాసితులు, టీడీపీ శ్రేణులు ముఖ్యమంత్రికి పెద్దఎత్తున కృతజ్ఞతలు తెలుపుకున్నారు.













# విధివిధానాలు ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలా?

- **నోరుంది కదా అని మాట్లాడుతున్నారు**
- **మీలో రియలైజేషన్ వస్తుందో లేదో చూస్తాం**
- **తిట్టినా.. తిట్టకున్నా మేం బలపడటం గ్యారంటీ**
- **వైసీపీ నేతలకు పవన్‌కళ్యాణ్ హితవు**

అమరావతి(చైతన్యరథం): వైసీపీ పార్టీతో వ్యక్తిగతంగా ఎటు వంటి శత్రుత్వం లేదు..వారి విధివిధానాలను ప్రశ్నిస్తే తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశం జరిగింది. 'మెత్తగా ఉండాలి కానీ.. మరీ మౌనంగా ఉంటే చేతకానితనంగా చూస్తారు. ఇటీవల పంతం నానాజీ మాట్లాడింది నేను చూశాను. అటువంటివి సమర్థించం. కానీ అదే ప్రాంతంలో ఉన్న వైసీపీ నేత ఏం మాట్లాడారో ఆ పార్టీ నాయకులకు తెలీదా? వైసీపీ నాయకులు నోరుంది కదా అని అధికారంలో ఉన్నప్పుడు నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఇప్పుడు కూడా అదే విధంగా మాట్లాడుతున్నారు.. ఎక్కడా తగ్గకండి. 11 సీట్లు కాదు.. ఒక్క స్థానానికి చేరినా.. ఇలాగే ఇష్టారాజ్యంగా మాట్లాడండి. సీఎం చంద్రబాబు సతీమణి గురించి మాట్లాడితే ప్రశ్నించకూడ దా? అసలు మీలో రియలైజేషన్ ఎంతవరకు వస్తుందో మేమూ చూస్తాం. మీరు తిట్టినా.. తిట్టకపోయినా.. మేము బలపడటం గ్యారంటీ' అని అంటూ వ్యాఖ్యానించారు.

## పార్టీని ముందుకు తీసుకువెళ్లే కార్యకర్తే సాధక్

సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా కాదని.. కానీ అర్హులైన వారికి పూర్తిగా అందాలనేది తమ విధానమని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిని ఎవరూ పట్టించుకో లేదని.. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రులపై




దృష్టి సారించినట్లు చెప్పారు. నేడు గ్రామాలలో, నగరాలలో రోడ్లు వేసింది ఎవరు అని ప్రశ్నించారు. కేవలం సంక్షేమ పథకాలతోనే ప్రజలు ఓట్లు వేయరని.. ఇందుకు వైసీపీనే అందరికీ నిదర్శనమన్నారు. పథకాల పేరు చెప్పి ప్రజలకు మౌలికవసతులు కల్పించ పోతే ఎలా అంటూ నిలదీశారు. గ్రామాలలో తాగునీటిని పూర్తిగా అందేలా కేంద్రం సహకారంతో చర్యలు చేపట్టామన్నారు. ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులంతా కూడా ప్రజల అవసరాలను ముందు గుర్తించాలని సూచించారు. బడ్జెట్‌లో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలో ముందే ఆలోచన చేయాలన్నారు. విశాఖలో 2025 ఆగస్టులో నిర్వహించిన సేనతో సేన కార్యక్రమం ద్వారా మెంబర్ షిప్ చేపట్టామన్నారు. పార్టీని ముందుకు తీసుకువెళ్లే కార్యకర్తే సాధక్ అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది సభ్యత్వం కోసం సాధకులు పని చేశారని ప్రశంసించారు. 18 వేల మంది సాధక్‌లను నాయకత్వ దిశగా తీసుకెళ్తే.. మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.







గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టిపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తోన్న సీఎం చంద్రబాబు నాయుడు. ఆసుపత్రిలో అందుతోన్న వైద్య సేవలను సమీక్షించిన తర్వాత రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి, అందుతోన్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న ఔట్ పేషెంట్ సేవలు, మాతా-శిశు ఆరోగ్య కార్యక్రమాలు, బాలికల ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమాలపై డాక్టర్ పునూరు శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వ్యాధుల స్క్రీనింగ్, ఔషధాలు, నిర్ధారణ పరీక్షల అందుబాటువంటి వాటిపై చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రిజిస్ట్రేషన్ విభాగం, వైద్యుల కన్సల్టేషన్ గదులు, స్టాఫ్ నర్స్ సేవల కేంద్రం, ల్యాబ్, ఫార్మసీ, కౌన్సెలింగ్, ఫాలోఅప్ వ్యవస్థలను సీఎం పరిశీలించారు.






## రాజధాని రైతులపై
# గొడ్డలి పార్టీ కుట్రలు సాగవు

- ద్వంద్వ వైఖరే వైసీపీపై తిరుగుబాటుకు కారణం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): రాజధాని విషయంలో రాష్ట్ర ప్రజల ను, రైతులను మోసం చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు మళ్లీ రైతులపేరుతో డ్రామాలు ఆడుతున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అమరావతి రాజధానిని ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేసి వేలాది మంది రైతుల జీవితాలతో చెల గాటమాడిన వారే ఇప్పుడు 'అమరావతి రైతు పరిరక్షణ' పేరుతో కొత్త నాటకాలు ఆడటం సిగ్గు చేటన్నారు. ప్రజలు గొడ్డలి పార్టీ నాట కాలు గమనిస్తున్నారు. అందుకే వైసీపీ నాయకులు ఎక్కడికి వెళ్లినా తీవ్ర వ్యతి రేకత ఎదుర్కొంటున్నారని అన్నారు. రాజకీయాల కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తే ప్రజ ల నుంచి తీవ్ర ప్రతిస్పందనే వస్తుంది. ప్రజలను రెచ్చగొట్టి ఆ తర్వాత బాధితు లమని నటించడం వైసీపీకి అలవాటై పోయింది. ఆ రాజకీయాలకు కాలం చెల్లిందని హితవుపలికారు. అమరావతి రైతుల నిరసనలను అణచివేసేందుకు వైసీపీ పాలనలో ఎలాంటి దౌర్జన్యాలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తు న్నాయని, ఇప్పుడు అదే రైతుల పేరుతో రాజకీయ పర్యటనలు చేయడంపూర్తిగా అవకాశవాద రాజకీయమని విమర్శించారు. గొడ్డలి పార్టీ నాయకుల పర్యటన సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేం దుకు విధుల్లో ఉన్న పోలీసులపైనే దాడి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడటం అత్యంత విచారకరమని, ప్రజాస్వా మ్యంలో పోలీసులపై దాడులకు ఎలాంటి సమర్ధన ఉండదని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టడం.. ఉద్రిక్తతలు సృష్టించ డం..తర్వాత నాటకాలు ఆడటం గొడ్డలి పార్టీ రాజకీయాలుగా మారాయి. అలాంటి చౌకబారు రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇక ఏ మాత్రం నమ్మరు. అమరావతి రైతుల మనోభావా లను గౌరవించాల్సిందే తప్ప వారిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలని హితవుపలికారు.

# ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు

- దర్శనం, వసతుల్లో ఎక్కడా రాజీపడేది లేదు
- శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్
- ప్రాజెక్టు అమలులోకి వస్తే సురక్షిత ప్రయాణం
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- శ్రీశైలం అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష



శ్రీశైలం(చైతన్యరథం): రాష్ట్రంలో దేవాలయాలను దర్శించు కునే భక్తులకు మరింత మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించ డమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. భక్తుల సేవనే దేవసేవ గా భావిస్తూ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. శు క్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న ఆయన శనివారం ఉదయం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు, దేవస్థానం యంత్రాంగంతో సమీక్ష నిర్వహించిన మంత్రి భక్తుల సౌకర్యాలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు భక్తులతో మంత్రి స్వయంగా మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మురుగునీటి శుద్ధి కేంద్రం సమీపంలో ప్రతిపాదిత వాటర్ ఏరోడ్రమ్ టెర్మినల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో చర్చించారు. తరువాత సున్నిపెంటలో దేవస్థానం సిబ్బందికి నిర్మించిన వసతిగృహాలను పరిశీలించారు. దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో మూడు నమూనాల్లో 297 గృహాలను నిర్మించడం జరిగిందని తెలిపారు.

సీఎం ఆదేశాల మేరకు సిబ్బంది నివాసానికి అనువైన అన్ని సౌకర్యాలు కల్పించే చర్యలు చేపట్టామని చెప్పారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో వసతిగృహాల సముదాయంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, త్వరలోనే దేవస్థానం సిబ్బందిని సున్నిపెంటకు తరలించే ప్రక్రియ ప్రారంభి స్తామని వెల్లడించారు. సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు విధులకు వచ్చే సిబ్బందికి దేవస్థానం ఆధ్వర్యంలో తగిన సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే శ్రీశైలానికి చేరుకునే భక్తులకు మరింత సౌకర్య వంతమైన, సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

చైతన్యరథం

# బయటపడ్డ భూమన అనుచరుల అరాచకం

- ఫేస్‌బుక్ కామెంట్ పెట్టాడని యువకుడి కిడ్నాప్
- గత ప్రభుత్వంలో అరాచక పర్వం
- నాలుక కోసి.. నరాలు కట్ చేసి హత్యాయత్నం
- సజ్జల ఆదేశాలతో బాధితుడిపైనే ఎదురు కేసు
- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అనుచరుల భూదందా
- న్యాయం చేయాలని ప్రజావినతుల్లో గోడు
- అర్జీలు స్వీకరించిన హోంమంత్రి వంగలపూడి అనిత





మంగళగిరి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో భూమన అనుచరుల అరాచకంపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజావినతుల దినంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. వైఎస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామానికి చెందిన పత్తి మణి సమస్యను వివరిస్తూ 2023 జూన్ 9న తిరుపతి నాటి ఎమ్మెల్యే కొడుకు అభినయ్‌రెడ్డి తన ఫేస్‌బుక్‌లో "నారా లోకేష్, పవన్‌కళ్యాణ్‌ను తిరుపతిలో అడుగుపెట్ట నివ్వం" అంటూ ఒక పోస్ట్ పెట్టారు. దీనిపై తాను స్పందిస్తూ "ఇది రాచరికపు పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు. మీరు కూడా నందలూరు నుంచి తిరుపతికి వెళ్లలేదా? కామెంట్ పెట్టారు. ఈ కామెంట్‌ను మనసులో పెట్టుకుని జూన్ 11వ తేదీన భూమన అనుచరుడైన రాజు మరికొంతమందితో కలిసి రాజంపేట హరిత హోటల్ దగ్గర తనపై దాడి చేశారు.

కారులో కిడ్నాప్ చేసి నాలుక కోసి, చేతి నరాలు కట్ చేసి, కంటిపై రాళ్లతో కొట్టి చంపేందుకు ప్రయత్నించారు. దాడి సమయంలో తిరుపతి వైసీపీ ఎమ్మెల్యేకు, ఆయన కుమారుడికి వీడియో కాల్ చేసి చూపించారు. "వీడిని బాగా కొట్టి, చంపేసి అలిపిరి అడవిలో పారేయండి" అని వారు చెప్పారు. రాజంపేట పోలీసులు వెతుకు తున్నారని తెలిసి నిందితులు రాపూరు మీదుగా తిరుపతికి పారిపోయే ప్రయత్నం చేశారు. కానీ చిట్వేలి మూడు రోడ్ల కూడలి వద్ద పోలీసులు నిందితుల కార్లను పట్టుకుని తనను రక్షించి ఆస్పత్రికి తరలించారు. నిందితులను మన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించగా అప్పటి డీఎస్పీ చైతన్య యాదవ్‌కు వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి ఫోన్ వచ్చింది. దీంతో పోలీసులు నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి రాత్రి 2 గంటల సమయంలో పోలీస్ సెక్యూరిటీతో తిరుపతికి పంపించివేశారు. తాను ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉంటే పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకుండా తనపైనే అక్రమ కేసులు పెట్టారు. తన భార్యను, మూడేళ్ల కొడుకును మన్నూరు స్టేషన్‌లో సుమారు 4 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని నేతలు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.డి. నజీర్ లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

### వైసీపీ మాజీ ఎమ్మెల్యే అండతో భూకబ్జా

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన కోట చంద్రశేఖర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలోని సర్వే నెంబర్లు 303-1, 303-2ఏ1, 303-2ఏ2, 303-2బీ (ఎల్‌పీఎం నెం: 1804-1805) పరిధిలో గల 3.41 ఎకరాల భూమి ప్రభుత్వ వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం కుమ్మరి ఇనాం భూములు గానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రోద్బలంతో ఆయన అనుచరులు ఆక్ర మించి అనధికార లే-అవుట్ వేసి విక్రయించి భారీగా లబ్ధి పొందారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన ద్వారా ఫిర్యాదు చేసినా ఆన్‌లైన్ దరఖాస్తుగా కూడా నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించారు. స్థానిక రావులపాలెం తహశీల్దార్ సైతం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ ఎన్‌వోసీ జారీ చేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి దాగి ఉంది. వారిపై చర్యలు తీసుకుని ఇనాం భూమిని అక్రమార్కుల చేతుల్లోంచి కాపాడి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి కోరారు.

### భూమిని కేటాయించి న్యాయం చేయాలి

విశాఖపట్నంకు చెందిన పీలా కోటేశ్వరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని దేవస్థానానికి తీసుకున్నందుకు ప్రతిఫలంగా మరోచోట సమానమైన భూమిని కేటాయించేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరిస్తూ 2017లో అధికారికంగా ఉత్తర్వు లు కూడా జారీ చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రక్రియను ముందుకు సాగనివ్వకుండా నిలిపివేసి ఆ భూములను అన్యాక్రాంతం చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేసింది. తమ భూమికి సరిపడా ప్రత్యామ్నాయ భూమిని బదలా యించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరాడు.

### తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారు

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం మజరా ఎగువగొల్ల పల్లి గ్రామానికి చెందిన పి.సురేంద్ర యాదవ్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ 2019-2024 మధ్యకాలంలో టీడీపీ బలోపేతం కోసం రాజంపేట పార్లమెంట్ పరిధిలో క్రియాశీలంగా పనిచేశాను. వైసీపీలోకి రాకపోతే తప్పుడు కేసులు పెడతామని కొంత మంది పోలీసు అధికారులే బెదిరించారు.

ముదివేడు మాజీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు సురేంద్ర, వెంకట రమణలతో పాటు, అప్పటి అంగళ్ల పంచాయతీ కార్యదర్శి ఎం.టి.జి.ప్రసాద్‌లు కలిసి అప్పటి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అండతో తనపై అక్రమ కేసులు బనాయించారు. ఇప్పుడు కూడా ముదివేడు ప్రస్తుత ఎస్ఐ దిలీప్ కుమార్ తనకు ఎలాంటి బ్రాండీ షాప్ లేకపోయినా ఉన్నట్లు చూపించి తప్పుడు కేసులు బనాయిం చారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### వైసీపీ నాయకుడి భూ ఆక్రమణ

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నెంబర్ 352లోని 80 సెంట్ల చెరువు భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రోద్బలంతో స్థానిక రావులపాలెం మండల వైసీపీ ఎంపీపీ భర్త, వైసీపీ నాయకు డు కర్రి వీర్రెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నారు. అంతటితో ఆగకుండా ఆ ప్రభుత్వ స్థలంలో అనధికార లే అవుట్ కూడా వేశారు. ఈ అక్రమ ఆక్రమణపై దేవరపల్లి గ్రామస్థులు 72 మంది సంతకాలతో స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ విచారణ జరిపి సదరు చెరువు గట్టు ఆక్రమణకు గురైందని, అది గ్రామకంఠం పరిధిలోకి వస్తుందని నిర్ధారించారు. పంచాయతీ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన నివేదిక ఇచ్చారు. అయినా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్ర మించి అనధికార లే అవుట్లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

### నిందితులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామానికి చెందిన రమేష్‌బాబు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో 0.62 సెంట్ల మాగాణి భూమికి పక్కనే ఉన్న సుంకర సంగమేశ్వరరావు భూమికి మధ్య గత 30 ఏళ్లుగా సరిహద్దు వివాదం నడుస్తోంది. ఏప్రిల్ 29న సుంకర సంగమేశ్వ రరావు, అతని కుమారుడు వెంకట సత్యవరప్రసాద్, బంధువు సుంకర రామచంద్రరావు, కొందరు వ్యక్తులు కలిసి తన భూమిలోకి చొరబడి దౌర్జన్యంగా సరిహద్దు రాళ్లను పాతిపెట్టారు. ట్రాక్టర్‌తో అక్కడికి వెళ్లి ఆ రాళ్లను తొలగించే ప్రయత్నం చేయగా సత్యవరప్ర సాద్ కత్తితో ఎడమ మోకాలిపై నరకడంతో మోకాలు చిట్లిపో యింది. స్టేషన్‌లో కేసు నమోదు అయినా నిందితులను ఇంత వరకు అరెస్ట్ చేయలేదు. నిందితులు తన కుటుంబాన్ని బహిరం గంగా బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# రైతు పరిరక్షణ ముసుగులో వైసీపీ నాటకాలు

- ప్రజాప్రభుత్వంపై కుట్రలకు ప్రజలే బుద్ధిచెబుతారు
- రెచ్చగొట్టాలని చూస్తే నిజాలతో తిప్పికొడతాం
- కుర్చీ కోసం ఆరాటం మీది..ప్రజాసేవకు పవన్
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్




అమరావతి(చైతన్యరథం): ఐదేళ్ల పాటు అధికార దాహంతో రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ నేతలకు, పదవులు ఉన్నా లేకపోయి నా నిత్యం ప్రజల పక్షాన నిలబడే పవన్‌కళ్యాణ్ నైతికతను విమ ర్శించే స్థాయి లేదని మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్ సాధిస్తున్న అద్భుత విజయాలు, ప్రజాదరణను చూసి వైసీపీలోని కాపు నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శిం చారు. పల్లె పండుగ ద్వారా గ్రామాలు, ఏజెన్సీ ఏరియాల్లో రహదారులు నిర్మించి పంచాయతీరాజ్ శాఖకు అవార్డుల పంట పండించారు.

యువతకు ఉపాధి, రక్షణ, అభివృద్ధి దక్కాలనేది ఆయన నిరంతర తపన. రూపాయి అవినీతి లేకుండా ప్రభుత్వ నిధులు ప్రతి పైసా నేరుగా ప్రజలకే చేరాలనేది ఆయన నైజం. కుర్చీ కోసం ఆరాటం మీది.. ప్రజా సేవ కోసం పోరాటం మా నాయకుడు పవన్‌కళ్యాణ్‌దని స్పష్టం చేశారు.

### మీ ఐదేళ్ల వైఫల్యాలకు సమాధానం ఎక్కడ?

కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ముందు 2019 ఎన్నికల ముందు మీరిచ్చిన హామీలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు విడతల వారీగా మద్య నిషేధమని చెప్పి జే బ్రాండ్ల పేరుతో దోచుకున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచారు..జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. అధికా రంలోకి వచ్చిన వారంలో రద్దు చేస్తామన్న సీపీఎస్ హామీ అటకెక్కింది. వీటిపై మీ అధినాయకుడిని నిలదీసే దమ్ము, ధైర్యం మీకుందా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు.

ఐదేళ్లు యువత కు ఒక్క మెగా డీఎస్సీ ఇవ్వకుండా, జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన మీరు.. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం పెట్టి పరిశ్రమలను రప్పిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని వేలెత్తి చూపుతారా? అని ప్రశ్నించారు.

### ప్రజారాజధానిపై అక్కసు వెళ్లగక్కితే బుద్ధి చెబుతారు

ప్రజారాజధాని అమరావతిపై వైసీపీ మొదటినుంచీ కక్షగట్టింది.శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆపార్టీ నేతలు నిత్యం విషం చిమ్ముతున్నా రని ధ్వజమెత్తారు. అమరా వతిలో కేవలం ప్రజలను రెచ్చగొట్టేందుకే వైసీపీ నాయకులు పర్యటనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజధానిపై, కూటమి ప్రభుత్వంపై మీ అక్కసు ఇలాగే కొనసాగిత వచ్చే ఎన్నికల్లో మీకు గుడ్డు రావడం కాదు కనీసం డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మీ హయాంలో జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, మద్య పాననిషేధం హామీలపై ముందు స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. భవిష్యత్తు తరాల కోసం అందమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. నోటికొచ్చినట్టు అబద్ధాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోవడానికి ఇది మీ తుగ్లక్ రాజ్యం కాదు.. ఇది ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం.. ప్రతి అబద్ధాన్ని నిజాలతో తిప్పికొడతామని ఘాటుగా స్పందించారు.

# అమరావతిలో వైసీపీ నేతల రౌడీయిజం

- ఇది ముమ్మాటికీ రైతులపై దాడే
- వారిచ్చిన ఫిర్యాదులపైనా విచారణ
- హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి(చైతన్యరథం): రైతులపై రౌడీయిజం చేసేందుకే వైసీపీ నేతలు అమరావతి వెళ్లారని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడేనని ఆక్షేపించారు. రాజధానిలో వైకాపా నేతల పర్యటన ఉద్రిక్తతలకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఉండవల్లిలో రాజధాని రైతులు, వైకాపా నేతల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ ఘటనపై అనిత స్పందించారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు చెప్పారు. టీడీపీ ఆఫీసుపై దాడి చేసిన గూండాలే రైతులపై దాడికి వచ్చారు. అమరావతి వెళ్లిన వారందరి విజువల్స్ ఉన్నాయి. వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదు. రైతులను పరామర్శించేందుకు వెళ్లారా? రౌడీయిజం చేసేందుకు వెళ్లారా? వైకాపా నేతలు వెళితే సమస్య వస్తుందని పోలీసులు ముందుగానే చెప్పినా వినిపించుకోలేదు. వైకాపా నేతల పర్యటన పై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు. పెనుమాకలో 90 శాతం రైతులు రాజధానికి భూములిచ్చారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులపైనా విచారణ చేస్తామని చెప్పారు. ప్రజల కలల రాజధాని అమరావతి శరవేగంగా ముందుకెళు తుందని అన్నారు. రాజధాని నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని అహర్ని శలు కష్టపడుతున్నామని తెలిపారు. ఆనాడు మూడు రాజధానుల పేరుతో డ్రామా ఆడారు. ఇప్పుడు మావిగన్ అంటూ నే రాజధానికి ఎలా వస్తారు? అమరావతి పూర్తయితే మనుగడ ఉండదనే వైకాపా డ్రామాలు ఆడుతోంది. వైకాపా అరాచకాలపై అమరావతి రైతులు ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్‌పోలియో

- ఉండవల్లిలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- వైజాగ్‌లో హాజరుకానున్న వైద్యఆరోగ్య మంత్రి
- 49.20 లక్షల మందికి చుక్కలే లక్ష్యం
- ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు వెల్లడించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు, వైజాగ్‌లో వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో 5 ఏళ్ల లోపు ఉన్న 49.20 లక్షల మందికి పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. ప్రత్యేక బూత్‌లలో పోలియో చుక్కలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసిన డోస్‌లను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపిం చామని తెలిపారు. మామూలుగా జరిగే ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ(పుట్టగానే, 6 వారాలకు, 10 వారాలకు, 14 వరాలకు, 16 నెలలకు) 5 డోస్‌ల పోలియో (ఓపీవీ) చుక్కలు వేస్తారు పల్స్‌పోలియో రోజున అదనంగా ఒక డోస్ (2 చుక్కలు) వేస్తారు. పల్స్ పోలియో కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.6.20 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నట్లు వివరించారు.



## నేడు వేసుకోలేని వారికి.. ఇంటింటికి వెళ్లి చుక్కలు

రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో(ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ వర్కర్, స్టాఫ్ నర్సుల బృందం) పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేస్తారు. పలు కారణాల వల్ల ఆదివారం పోలి యో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు వారి ఇళ్లకు మరసటి రెండురోజులు ప్రత్యేక వైద్యబృందాలు వెళ్లి చుక్కలు వేస్తాయి. మెడికల్ అధికారులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛం ద సంస్థల ప్రతినిధులు, ఇతరులు, నేషనల్ ఇమ్యు నైజేషన్ డే కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే సదరు జిల్లాలోని మంత్రు లు, ప్రజా ప్రతినిధులు కూడా పల్స్ పోలియో కార్యక్ర మంలో పాల్గొంటారు.

## ముఖ్యమైన కూడళ్లలో కేంద్రాలు

5 ఏళ్లలోపు ఇంటిలోని పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తే P గుర్తుతోనూ, ఏ చిన్నారైనా మిస్ అయితే X గుర్తు వేస్తారు. అన్ని ట్రాన్సిట్ పాయింట్లలో (బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, విమా నాశ్రయాలు, ప్రధాన ఆస్పత్రులు, మేళాలు, బజార్‌లు మొదలైనవి) ట్రాన్సిట్ బృందాలు పర్యటిస్తాయి. గుర్తించిన పలు ప్రాంతాలను (స్లమ్‌లు, సంచార జాతులు, నిర్మాణ స్థలాలు, ఇటుక క్షేత్రాలు, ఇతర వలస ప్రాంతాలు) కవర్ చేయడానికి ప్రత్యేక మొబైల్ బృందాలు పనిచేస్తాయి. బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్ర యాలు, మేళాలు, బజార్‌లు, పర్యాటక ప్రదేశాలలో ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

# రాజధాని ద్రోహి జగన్‌రెడ్డి గో బ్యాక్

- అమరావతి రైతుల నినాదాలు
- వైసీపీ నాయకులకు భంగపాటు



అమరావతి(చైతన్యరథం): రాజధాని ప్రాంతంలో వైసీపీ నేతలకు అమరావతి రైతుల నుంచి భంగపాటు ఎదురైంది. శనివారం పెనుమాక సందర్శనకు వచ్చి న వైసీపీ నేతల బృందాన్ని ఉండవల్లివద్ద రాజధాని రైతులు అడ్డుకున్నారు. వాహ నాలు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా'రాజధాని ద్రోహి జగన్, గో బ్యాక్'అంటూ రైతులునినాదాలు చేశారు. వైసీపీ నేతలు ఏమొహం పెట్టుకుని రాజ ధానికి వస్తారని ప్రశ్నించారు. మావిగన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమా ండ్ చేశారు.నల్లబ్యాడ్జీలు ధరించి వైసీపీ నేతల పర్యటనకు వ్యతిరేకంగా ఆందోళ న చేపట్టారు. అమరావతిని రాజధానిగా అంగీకరించిన తర్వాతే పర్యటించాలని అన్నదాతలు డిమాండ్‌చేశారు. రైతులను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రయత్నించ డంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజధాని రైతులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగా యి. ఈఘటనలో ఓ కానిస్టేబుల్ గాయ పడగా, ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించి భద్రతనుకట్టుదిట్టం చేశారు.

## వైసీపీ శ్రేణులే దాడి చేశాయి: రాజధాని రైతులు

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై వైసీపీ శ్రేణులే కోడిగుడ్ల తో దాడి చేశాయని రాజధాని రైతులు ఆరోపించారు.అలాగే వైసీపీ నేతలు చేసి న వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్‌తో పాటు పెనుమాక,కృష్ణాయపాలెం ప్రాం తాల్లో కూడా రైతులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. అమరావతి రాజధాని అంశంపై తమపోరాటం కొనసాగుతుం దని రైతన్నలు స్పష్టంచేశారు. మరోవైపు ఈఘటనపై పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.పరిస్థితిప్రస్తుతం అదు పులో ఉన్నప్పటికీ అమరావతి ప్రాంతం లో ఉద్రిక్తవాతావరణం కొనసాగుతోంది.




# మద్యం కుంభకోణంలో సూత్రధారి జగన్‌రెడ్డే

- ఆయన అండతోనే దోపిడీకి స్కెచ్
- పక్కా ప్లాన్‌తో తాడేపల్లి ప్యాలెస్‌కు డబ్బు
- సంబంధమున్న ప్రతిఒక్కరికీ శిక్ష తప్పదు
- లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు



మంగళగిరి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ లో జరిగిన వేల కోట్ల మద్యం కుంభ కోణానికి జగన్‌రెడ్డే ప్రధాన సూత్రధారి, పాత్రధారి, నేర వ్యూహకర్త అని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జగన్‌రెడ్డి ఆదేశాలు, పాత్ర లేకుండా ఇంతటి భారీ మద్యం కుంభకోణం సాధ్యం కాదు. ఆయన అండతోనే పక్కనే ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, విజయ సాయిరెడ్డి, కారుమూరి వంటి నేతలు ఈ దోపిడీలో పాలు పంచుకున్నారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే దాదాపు 52 మంది అరెస్ట్ అయ్యారు. రాజ్ కసిరెడ్డి అరెస్ట్ తర్వాత అసలు రంగు బయ టపడింది. మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్స్ లేకుండా కేవలం నగదు మాత్రమే తీసుకోవాలని పక్కా ప్లాన్ చేసి ఆ వేల కోట్ల రూపాయలను తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చారని వివరించారు.

## ప్రభుత్వ ముసుగులో నిలువు దోపిడీ

సాధారణంగా ప్రైవేట్ వ్యక్తులు చట్టా లకు లోబడి వ్యాపారాలు చేసుకుంటా రు. కానీ జగన్ ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వమే వ్యాపారం చేస్తే పారదర్శకంగా ఉంటుందని ప్రజల ను నమ్మబలికి మద్యం మాఫియాను నడిపారు. మద్యం ద్వారా సంపాదించిన అక్రమ సొమ్ముతో దుబాయ్, దక్షిణాఫ్రికా దేశాలకు షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించారు. ఆ డబ్బుతో టాంజాని యా, జింబాబ్వేలలో మైనింగ్ వ్యాపారాలు చేస్తూ.. ఇక్కడ సినిమాలు, రియల్ ఎస్టేట్, బంగారం కొనుగోళ్లు చేపట్టారని తెలిపారు.

## జే బ్రాండ్‌తో ప్రజల ప్రాణాల బలి

ఎన్నికల ముందు మద్యం నిషేధిస్తా నని నమ్మించి అధికారంలోకి వచ్చాక తీవ్రమైన విషపదార్థాలైన పైరోగాలోల్, థాలిక్ యాసిడ్, ఐసోథాలిక్ యాసిడ్ వంటి రసాయనాలతో కల్తీ మద్యా న్ని తయారు చేయించారు. ఈ విషపూరిత జే బ్రాండ్ మద్యంవల్ల రాష్ట్రంలో దాదా పు 30,000మంది కుటుంబ యజమా నులు ప్రాణాలుకోల్పోయారు. మరో 35 లక్షల మంది కిడ్నీ, లివర్ వంటి తీవ్ర వ్యాధుల బారినపడి కుటుంబాలు రోడ్డు న పడ్డాయి.ప్రజల చావులతో వ్యాపారం చేసి జగన్ రూ.3,500 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకు కమీషన్లు పోగేసుకున్నారని ధ్వజమెత్తారు.

## ఆంధ్ర కిట్టుగాడు జగన్

జులాయి సినిమాలో విలన్ బిట్టు గాడు క్రైమ్‌చేయడానికి ఒక పద్ధతి చెప్పి వేరే పద్ధతిలో దోచుకున్నట్లు.. ఏపీలో జగన్ అనే 'కిట్టుగాడు' ప్రజలను దారుణంగా వంచించాడు. రూ.2000 పెన్షన్‌ను రూ.3000 చేస్తానని చెప్పి మాట మార్చడం, అమ్మ తోడు ఇక్కడే రాజధాని ఉంటుందని నమ్మించి రాజధాని లేకుండా చేయడం, సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేయడం జగన్ 'హిడెన్ ఎజెండా'కు నిదర్శనం. ఈ పాపాల వల్లే ప్రజలు ఆయనను 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడేశారు. మద్యం సరఫరా రవాణా టెండర్ల అధికారం జాయింట్ కలెక్టర్లకు ఉండగా దాన్ని పక్కనబెట్టి అనుభవంలేని వాసుదేవరెడ్డిని కార్పొరేషన్ ఎండీగా తెచ్చారు. రవాణా ఛార్జీలను విపరీతంగా పెంచి జగన్‌కు అనుకూలమైన ఒక సినిమా కంపెనీ సంస్థకు ఆ కాంట్రాక్ట్ అప్పగించి అక్కడ కూడా వేల కోట్లు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక కల్తీ బ్రాండ్లను పార దోలి విప్లవాత్మక మార్పులు తెచ్చింది. 3,396 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా కేటాయించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చింది. కల్లు గీసే గీత కార్మికుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా 10% దుకాణాలను (340 షాపులు) కేటాయిం చింది. మద్యం దుకాణాల్లో డిజిటల్ మనీ విధానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు మద్యం తయారీ కేంద్రంనుంచి దుకాణా నికి చేరేవరకు ప్రతిదశను ట్రాక్ చేసేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంజీవని వంటి పథకాలు, సీఎంఆర్ ఎఫ్ ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడితే.. జగన్ ప్రజల ఆరోగ్యా న్ని పణంగా పెట్టి డబ్బులు దోచుకున్నారు. ఈ మద్యం కుంభకో ణంలో ఉన్న ప్రతిఒక్కరినీ చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.

# గొడ్డలి పార్టీకి కర్మ రిటర్న్స్



- అందుకే అమరావతి రైతుల చేతిలో భంగపాటు
- గులకరాయి, కోడికత్తి డ్రామాలకు కాలం చెల్లింది
- అలజడులు సృష్టిస్తామంటే ఊరుకునేది లేదు
- రాజధానిలో పెయిడ్ డ్రామాలు మానుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హితవు

అమరావతి(చైతన్యరథం): కర్మ ఎవరినీ వదలిపెట్టదనే విషయాన్ని వైసీపీ నేతలు ఇకనైనా తెలుసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర హితవు పలికారు. గత ఐదేళ్ల అమరావతి రైతులను వైసీపీ నేతలు ఎంతలా హింసించారో, ఎంతలా వేధించారో ఏ ఒక్కరూ కూడా మరిచిపోలేదు. రైతు పరిరక్షణ సమితి పేరుతో గతంలో భూములిచ్చిన రైతులకు వ్యతిరేకంగా, రాజధాని అమరావతికి వ్యతిరేకంగా మూడు రాజధానుల పేరుతో శిబిరాలు నడిపించారు. న్యాయం కోసం న్యాయస్థానం నుంచి దేవస్థానం పాదయాత్రకు వెళుతున్న రైతుల పాలిట ఎంతటి క్రూరత్వాన్ని ప్రదర్శించారో ప్రజలందరికీ గుర్తుంది. మహిళా రైతులను బూటు కాళ్లతో తన్నించారు. పొత్తి కడుపుల్లో లాఠీలతో కుళ్లబొడిచారు. మీ కుట్రలు, కుతంత్రాలను ప్రజలు తిప్పికొట్టి వైసీపీని రాజకీయంగా భూస్థాపితం చేశారు. ఇప్పుడు మళ్లీ రైతు పరిరక్షణ అంటూ రైతుల జీవితాలతో ఆట లాడేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు. రైతుల ముసుగులో గొడ్డలి పార్టీ నేతలు పోలీసులపై దాడులకు తెగబడటం దుర్మార్గం. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనుకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కుట్రలు చేయడం, కుతంత్రాలకు పాల్పడడం గొడ్డలి పార్టీకి అలవాటుగా మారిపో యింది. పెయిడ్ ఆర్టిస్టులతో వెళ్లి రైతులను రెచ్చగొట్టి మళ్లీ తాము బాధితులమని చెప్పుకోవడానికి వైసీపీ నేతలకు సిగ్గుండాలి. ఐదేళ్ల చేసిన అరాచకాలు, మూడు రాజధానులు, మావిగన్ ప్రకటనల తో చేసిన విధ్వంసం చాలు. ఇంకా అవే కుట్రలు కొనసాగిస్తాం.. అశాంతి రగులుస్తామంటే వైసీపీని శాశ్వతంగా సమాధి చేయడం తథ్యమని హెచ్చరించారు.

## రొట్టెల పండుగకు భారీ ఏర్పాట్లు

◆ పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

◆ పటిష్ట భద్రత కోసం డ్రోన్ల ఆవిష్కరణ ◆ లంగర్ ఖానా ప్రారంభం



నెల్లూరు(చైతన్యరథం): రొట్టెల పండుగ రెండో రోజు సందర్భంగా బారాషహీద్ దర్గాలో చేపట్టిన ఏర్పాట్లను శనివారం మంత్రి పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అజిత, మేయర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ నందన్ తదితరులతో కలిసి భక్తుల భద్రత, నిఘా కోసం ఏర్పాటు చేసిన నాలుగు అత్యాధునిక డ్రోన్లను ప్రారంభిం చారు. అనంతరం లంగర్ ఖానాను ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు. రొట్టెల పండుగ తొలిరోజు దాదాపు 3 లక్షల మంది భక్తులు దర్గాను సందర్శించినట్లు తెలిపారు. రెండో రోజు 4 నుంచి 5 లక్షల మంది వరకు, ప్రధాన ఘట్టం జరిగే ఆదివారం 6 నుంచి 7 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకా శం ఉందని తెలిపారు. శనివారం అర్ధరాత్రి గంధ మహోత్సవం, ఆదివారం రొట్టెల పండుగ ప్రధాన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నాలుగు అత్యాధునిక డ్రోన్లను వినియోగంలోకి తీసుకువచ్చామని, రాత్రి వేళల్లో కూడా స్పష్టమైన దృశ్యాలను అందించే ఈ డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీటీవీ కెమెరాల ద్వారా దర్గా పరిసరాలు, ఘాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు నిధులతో కలిపి రూ.10 కోట్ల వ్యయంతో భారీ ప్రార్థనా మందిరం నిర్మిస్తున్నామని, వచ్చే రొట్టెల పండుగ నాటికి అది అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే కసుమూరు దర్గా సహా ఇతర ఆధ్యాత్మిక కేంద్రాలను అను సంధానిస్తూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీసీలు దీక్ష, సౌజన్య, పోలీస్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ విమానాశ్రయాల్లో బార్లు

### లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ గ్రీన్‌సిగ్నల్



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ లోని ఎయిర్‌పోర్టుల్లో బార్ లైసెన్స్‌లకు ఎక్సైజ్‌శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి ఎయిర్‌పోర్టు మినహా అన్ని ఎయిర్‌పోర్టులకు బార్ లైసెన్స్‌లు వర్తిం చనున్నాయి. అయితే ఎయిర్‌పోర్టు ఆప రేటర్ సిఫారసు ఉంటేనే బార్ లైసెన్స్ మంజూరు అవుతుంది. బార్ లైసెన్స్ దరఖాస్తుకు 5లక్షల రూపాయల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుం ది. ప్రయాణికుల రద్దీ 20లక్షలకుపైగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.25లక్షలు ఉండ నుంది. ప్రయాణికుల రద్దీ 20లక్షల లోపు ఉన్న ఎయిర్‌పోర్టులకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.15 లక్షలు ఉంటుంది. ఆ ట్యాక్స్‌ను ఒకేసారి లేదా 6 సమాన వాయిదాల్లో చెల్లించే అవ కాశం ఉండనుంది. ఎయిర్‌పోర్టు బార్ల ను 24 గంటలపాటు నిర్వహించుకు నేందుకు అనుమతి ఉంటుంది. భద్రత, ఎయిర్‌పోర్టు ఆపరేషనల్ నిబంధనలకు లోబడి 24x7 సేవలు ఉండనున్నాయి. బార్ లైసెన్స్ నిబంధనల్లో సవరణలకు ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది.

## ఫేక్ ప్రచారాలకు అడ్డాగా గొడ్డలి పార్టీ

◆ డ్రగ్స్ కన్నా ప్రమాదకరం.. సమాజానికి హానికరం

◆ ఆ పార్టీకి ప్రజలు దూరంగా ఉండాలి

◆ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్



మంగళగిరి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు మళ్లీ ఫేక్ ప్రచారాలకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించకుండా అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే ఆ పార్టీ రాజకీయ సంస్కృతిగా మారింద ని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి చెందిన మీడి యా, సోషల్ మీడియా వేదికలు, కొందరు నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టారు. కులాల మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని ప్రయత్నించడం గొడ్డలి పార్టీ నైజమని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు ఫ్యాక్ట్ చెక్ వ్యవస్థ ద్వారా నిరంతరం నిజ నిర్ధారణ చేస్తూ ముందుకు వెళుతోందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను నమ్మకుండా నిజానిజాలు తెలుసుకుని మాత్రమే స్పందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### గొడ్డలి పార్టీ దుష్ప్రచారాలు ఎన్నెన్నో...

గతంలో ప్రకాశం బ్యారేజ్ 70 గేట్లలో కేవలం ఒక్క గేటు సాంకేతిక కారణాలతో మొరాయించి మిగిలిన 69 గేట్ల ద్వారా వరద నీరు క్లియర్‌గా కిందకు వెళుతున్నా 'గేటు పనిచేయట్లేదు.. విజయవాడ మునిగిపోతుంది' అంటూ ప్రజల్లో లేనిపోని భయాం దోళనలు సృష్టించారు. విజయవాడకు వరదలు వచ్చినప్పుడు బుడమేరు ఉధృతి వల్ల నీరు వస్తే.. కావాలనే ఆ నీటిని పొలాలకు మళ్లించి పంటలను ముంచేశారంటూ పచ్చి అబ ద్దాలు ప్రచారం చేశారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో భాగంగా కొవ్వొత్తులు, అగ్గిపెట్టెల కోసం ప్రభుత్వం రూ.23 లక్షలు ఖర్చు చేస్తే ఏకంగా రూ.23 కోట్లు అంటూ సోషల్ మీడియాలో తప్పుడు లెక్కలతో ప్రచారం చేశారు. అమరావతిని "భ్రమరావతి" అని, "కమ్మవారి రాజధాని" అని కుల ముద్ర వేసే ప్రయత్నం చేశారు. "రాజధాని మునిగిపోతుంది", "ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వలేదు", "కట్టడాలన్నీ గ్రాఫిక్స్" అంటూ రకరకాలుగా అబద్దా లు ప్రచారం చేస్తూ అభివృద్ధిని అడ్డుకు నేందుకు ఎన్నో నీచ ప్రచారాలు చేశారు. రైతులకు దేశంలో ఎక్కడా లేని విధంగా మామిడి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే దానిపై తప్పుడు ప్రచారం చేశారు. పొగాకు పొడైపోతే దాన్ని పొలానికి ఎరువుగా వాడుకుంటే గిట్టుబాటు ధర లేక రైతులు పంటను తొక్కించేశారంటూ తప్పుడు రంగు పూశారు. తిరుపతి గోశాలలో ఆవులు చనిపోయాయని, తిరుమల క్యూలైన్లలో భక్తులు ఆకలితో అలమటిస్తున్నారని అబద్ధాలు ఆడారు. శ్రీశైలం లడ్డూ ప్రసాదంలో కీటకం వచ్చిందని లేనిపోని ప్రచారం సృష్టించారు. గతంలో టీటీడీ చైర్మన్ క్రిస్టియన్ అంటూ మతపరమైన వివాదాలు రేపడా నికి ప్రయత్నించారు. ఒక రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ గారు చనిపోతే ఆ మృతిని హత్యగా చిత్రీకరించి మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూశారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' ఉచిత బస్సు పథకాన్ని కూడా అప్రతిష్ట పాలు చేయాలని చూశారు. ఉచిత ప్రయాణ పరిధిలోకి రాని డీలక్స్, ఏసీ బస్సుల్లో వైసీపీ కార్యకర్తలను, పెయిడ్ ఆర్టిస్టులను ఎక్కించి చంద్రబాబు మమ్మల్ని మోసం చేశాడు అంటూ తిట్టిస్తూ వీడియోలు తీసి ప్రచారం చేశారు. ఇలాంటి విద్వేషకరమైన, అబద్ధపు రాజకీయా లను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పటికే పూర్తిగా గమనించారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ ఆటలు ఇక సాగవని స్పష్టం చేశారు.

### ఐదేళ్లు విధ్వంసం తప్ప ఏమి చేశారు?

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనతో రాష్ట్రా న్ని ముందుకు తీసుకెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ఫేక్ ప్రచారాలను ప్రజలందరూ తిప్పికొట్టి నిజం పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌రెడ్డి కనీసం సొంత పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలను కలవడానికి తన ఇంటి తలుపులు తీయలేదు..ఆఖరికి తాడేపల్లి ప్యాలెస్ రోడ్డులోకి కనీసం సామాన్య జనాన్ని రానిచ్చిన చరిత్ర ఉందా? నాడు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ముఖం చాటేసిన ఆయన ఈరోజు రోడ్లపైకి వచ్చి వేస్తున్న డ్రామాలు, చేస్తున్న ఫేక్ ప్రచారాలు తారాస్థాయికి చేరాయి. సమాజానికి వినాశకరమైన మాదక ద్రవ్యాలకు ప్రజలు ఎంత దూరంగా ఉండాలో.. జగన్‌రెడ్డి అండ్ గొడ్డలి పార్టీకి కూడా అంతే దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది. వైసీపీ అనేది సమాజ క్షేమానికి ప్రమాదకరమైన ఒక వ్యవ స్థగా మారిపోయింది. ప్రజలు ప్రభుత్వం వైపు నుంచి వస్తున్న 'ఫ్యాక్ట్ చెక్' (నిజనిర్ధారణ) వివరాలను చూసి ఏది నిజమో, ఏది అబద్ధమో జాగ్రత్తగా తెలుసుకుని వైసీపీ కుట్రల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసకుడు

# జగన్




6.3.2024 టన్నెల్-2లో 6940 మీటర్ల మేర పూర్తి కాని లైనింగ్ పనులు

- రివర్స్ టెండరింగ్ పేరుతో సాగునీటి రంగం నిర్వీర్యం
- జీవో 356 తెచ్చి 225 సాగునీటి ప్రాజెక్టుల పనులు రద్దు
- రూ.2,612 కోట్ల పనులున్నా వెలిగొండ పూర్తి చేసినట్టు నాటకాలు
- కాలువలో నీరు పారించకుండా జాతికి అంకితం అంటూ ఎన్నికల స్టంట్
- రూ.12లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.600 కోట్లు కూడా ఖర్చు చేయని జగన్
- రెండేళ్లల్లో రూ.1,058 కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం

## కరెంట్ అనాలిసిస్

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

ప్రవీణ్ బోయ, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజల ప్రయోజనాల గురించి ఆలోచిస్తుంది. వారికి కావాల్సిన సౌకర్యాలను మెరుగుపరచడం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటుంది. కానీ 2019-24 మధ్య గొడ్డలి పార్టీ ప్రభుత్వం మాత్రం సొంత లాభం కోసం పాలన సాగించింది. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని అధోగతిపాల్జేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటికే నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసింది. జీవో నెం.356 తెచ్చి 225 సాగునీటి ప్రాజెక్టుల పనులను నిలుపుదల చేసింది. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.12లక్షల కోట్ల బడ్జెట్ పెడితే... 3శాతం నిధులను కూడా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయలేదు. పోలవరం ప్రాజెక్టును వరదల్లో ముంచేశాడు. ఉత్తరాంధ్ర, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు, రిజర్వాయర్లు, కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది మరణానికి కారణమయ్యాడు. ఎన్నికల సమయానికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేశాను అన్నట్టు దానిని జాతికి అంకితం చేస్తున్నట్టు నాటకాలు ఆడి ప్రజలను, రైతులను మోసం చేశాడు. ఎవడైనా పని పూర్తయితే జాతికి అంకితం చేస్తారు... కానీ వేల కోట్ల పనులు మిగిలి ఉన్నా, నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా రూ.2,612 కోట్ల విలువైన పనులు చేయాల్సిన ఉన్నా, అవేమీ చేయకుండానే ప్రాజెక్టు జాతికి అంకితం అంటూ జగన్ రెడ్డి చేసిన దొంగ స్కిట్‌కు జనం ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలరంగ చరిత్రలో... ముఖ్యంగా కరవు పీడిత పశ్చిమ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల దశాబ్దాల కలల ప్రాజెక్టు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు. నల్లమల అభయారణ్యం గుండా భారీ సొరంగాలు నిర్మించి, కృష్ణా జలాలను నల్లమల సాగర్ రిజర్వాయరుకు తరలించేలా దీనికి రూపకల్పన చేశారు. ప్రకాశం జిల్లాలో 3,36,100 ఎకరాలు, నెల్లూరు దుర్భిక్ష ప్రాంతమైన ఉదయగిరిలో 84వేల ఎకరాలు, కడప జిల్లా బద్వేలు ప్రాంతంలో 27,200 ఎకరాలకు కలిపి.. మొత్తం 43.50 టీఎంసీల కృష్ణా జలాలను తరలించాలని, 15 లక్షల మంది ఫ్లోరైడ్ బాధితులకు తాగునీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 1996లో చంద్రబాబు సీఎంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేసి 1998లో మొదటిగా నల్లమల సాగర్ రిజర్వాయర్లోని సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌ల నిర్మాణానికి కృషి చేశారు. సుంకేసుల గ్యాప్ పనులను ప్రారంభించారు. 2004-14 మధ్య కాలంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారు. పనులు చేపట్టకుండానే ముందుగానే మొబిలైజేషన్ అడ్వాన్సు నిధులు ఇచ్చి ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైనవి రెండు సొరంగాలు. 2014లో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2014-19 మధ్య మొదటి టన్నెల్ పనులు దాదాపు 80శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక మిషనరీని ఉపయోగించి క్లిష్టమైన నల్లమల అడవుల్లో తవ్వకం పూర్తి చేశారు. కేవలం ఐదేళ్లలోనే దాదాపు రూ.1,414 కోట్లు ఖర్చు చేసి మొదటి, రెండో సొరంగం పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

### నీరు పారించకుండానే జాతికి అంకితం

2024 ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ... తాము ఐదేళ్లలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేదనే అపవాదును తుడిచేసుకోవడానికి జగన్ రెడ్డి ఎంచుకున్న మార్గమే అసంపూర్తి వెలిగొండ ప్రారంభోత్సవ నాటకం. లోకంలో ఎక్కడైనా ఒక సాగునీటి ప్రాజెక్టును ప్రారంభించాలంటే రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా నీటిని వదిలి


6.3.2024 నాటికి టన్నెల్-1లో వాహనాల రాకపోకలు సాగేందుకు వీలు లేకుండా 1.20 లక్షల క్యూ.మీ. మట్టి పేరుకుపోయిన దృశ్యం

ప్రారంభించాలి. కానీ జగన్ నీరు లేని సొరంగానికి రిబ్బన్ కట్టి చేసి కేవలం గాలిని వదిలి జాతికి అంకితం చేశారు. వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన రెండో సొరంగంలో 12వ కిలోమీటరు వద్ద కొండ తవ్వుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పాడైపోయి కొండ లోపలే ఇరుక్కుపోయింది. మొదటి సొరంగం తవ్వకం పూర్తయినట్టు చూపించినప్పటికీ, దానికి సంబంధించిన లోపలి కాంక్రీట్ బెంచింగ్, లైనింగ్ పనులు పూర్తి కాలేదు. లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం లోపల కొండ కూలిపోయే ప్రమాదం ఉందని ఇంజనీర్లు హెచ్చరించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రాజెక్టు అసంపూర్తిగా ఉన్నప్పటికీ, రైతులకు కనీసం ఒక్క చుక్క నీరు కూడా అందించే పరిస్థితి లేకపోయినా... రూ.2,612 కోట్ల పనులు పెండింగులో ఉన్నా 2024 మార్చి 6న వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నామంటూ జగన్మోహన్ రెడ్డి రిబ్బన్ కట్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లోనే అతిపెద్ద 'ఫేక్ ప్రచారం'గా నిలిచింది.

### 'వెలిగొండ'ను గాలికొదిలేశాడు...

చంద్రబాబు హయాంలో 80 శాతానికి పైగా పనులు పూర్తి చేసుకున్న వెలిగొండ ప్రాజెక్టును... 2019-24 మధ్య కాలంలో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి గాలి కొదిలేశాడు. రూ.3,500 వేల కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసి కేవలం రూ.630 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.40ను జీవో నెం.50 పేరుతో రూ.1,099.40 కోట్లకు సవరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి టన్నెల్ పనులు ఒక కిలోమీటరు మాత్రమే చేసింది. రెండో సొరంగంలో నిబంధనలకు


6.3.2024 నాటికి టన్నెల్-2లో 11.847 కి.మీ. వద్ద అడ్డంగా వున్న టన్నెల్ బోరింగ్ మెషిన్‌ను తొలగించలేదు. సమస్య పరిష్కారం దిశగా ఎటువంటి చర్య తీసుకోకుండా జాతికి అంకితం చేశారు.

విరుద్ధంగా పేలుళ్లు చేపట్టి మాన్యువల్‌గా పనులు చేశారు. ఆ మట్టిని బయటకు తెచ్చేందుకు రెండు, మూడుచోట్ల టన్నెల్ 2 నుంచి టన్నెల్ 1లోకి భారీ రంధ్రాలను పెట్టారు. మరోవైపు ఫీడర్ కాలువలో చాలాచోట్ల స్ట్రక్చర్లు పెండింగ్‌లో ఉండగా అనేకచోట్ల మట్టి కట్టలు కోతకు గురై లైనింగ్ చేయాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా ఫీడర్ కాలువ లైనింగ్, కొన్నిచోట్ల వంతెనల నిర్మాణం చేయాల్సి ఉంది. తూర్పు ప్రధాన కాలువ, తీగలేరు కాలువ పనులు, వంతెనలు, హెడ్ రెగ్యులేటర్ అసంపూర్తిగానే ఉన్నాయి. నల్లమల సాగర్ పరిధిలో ముంపు గ్రామాలను ఇంకా ఖాళీ చేయించలేదు. సుమారు 7,555 మంది నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.1,400 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఒక్కరికీ అందజేయలేదు.

### నీ క్రిమినల్ క్రెడిట్ చోరీ ఎవ్వరూ చేయరు జగన్

తండ్రి శవంతో రాజకీయం చేయడం, కోడి కత్తి డ్రామా, బాబాయ్‌ను చంపేసి అధికారంలోకి రావడం, తల్లి, చెల్లిని గెంటేయడం, సొంత చెల్లి చీరపై వ్యాఖ్యలు చేయడం, దళితుల శవాలతో శవ రాజకీయం చేయడం ఇది నీ కె్రడిట్. నీ క్రెడిట్ ఏంటో తెలుగు ప్రజలకు తెలుసు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు. ఇసుక అక్రమ సంపాదన కోసం అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు తీసింది నీ క్రెడిట్. తుంగభద్ర, పులిచింతల, ఎర్రకాలువ, పింఛా డ్యామ్ దెబ్బతిన్నా పట్టించుకోకపోవడం నీ క్రెడిట్. అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రగల్బాలు పలికి ఐదేళ్ల పాటు మొద్దు నిద్రపోయిన జగన్ రెడ్డి నేడు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడటం హాస్యాస్పదం. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ.600 కోట్లు వెలిగొండ కోసం ఖర్చు చేసి ప్రాజెక్టును పూర్తి చేసినట్టు ప్రకటనలు చేసుకోవడం జగన్ క్రెడిట్ చోరీకి నిదర్శనం.

### 24 నెలల్లోనే పనుల్లో పురోగతి

కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును తొలి ప్రాధాన్యతగా తీసుకొని నిలిచిపోయిన కాంట్రాక్టర్ల బకాయిల్లో రూ.140 కోట్లు విడుదల చేసి పనులకు కొత్త ఊపు ఇచ్చింది. కేవలం 24 నెలల్లోనే సుమారు రూ.758.65 కోట్ల విలువైన పనులు పూర్తి చేసి ప్రాజెక్టును వేగవంతం చేసింది. టన్నెల్-2లో గత ఐదేళ్లలో కేవలం 2.77 కి.మీ. బెంచింగ్ మాత్రమే జరగ్గా కూటమి ప్రభుత్వం మిగిలిన 4.924 కి.మీ. బెంచింగ్ పూర్తిచేసి లైనింగ్ పనులను 702 మీటర్ల నుంచి 5.654 కి.మీ.కి పెంచింది. ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు కోసం ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి కోర్టు అనుమతులు సాధించి పనులను వేగవంతం చేసింది. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ రిటైనింగ్ వాల్స్, లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టన్నెల్-1 & తీగలేరు హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. నిర్వాసితులకు రూ.905.56 కోట్ల అదనపు నిధులు విడుదల చేసి తొలి విడతగా రూ.300 కోట్లు చెల్లించి పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. మొత్తం అంచనా వ్యయం రూ.9,081 కోట్లకు చేరిన ఈ ప్రాజెక్టు తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు, రెండో దశలో మిగిలిన 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి 15 లక్షల మందికి తాగునీరు సమకూర్చి కరవు-ఫ్లోరైడ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించనుంది.

## పార్లమెంటరీ స్థాయి సమీక్ష సమావేశంలో ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలుగుదేశంపార్టీ అధిష్టానం ఉత్తర్వులు మేరకు శనివారం విజయనగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన ప్రతి నెల, నాలుగో బుధవారం నిర్వహించే పార్లమెంటరీ స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంటరీ నియోజకవర్గ శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, స్థానిక శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఏపీ స్టేట్ మార్క్ఫెడ్ చైర్మన్ నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ కర్రోతు బంగార్రాజు, జనరల్ సెక్రెటరీ పి.ప్రసాద్, పార్లమెంటరీ స్థాయి కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... తెలుగుదేశంపార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు హృదయపూర్వక అభివాదాలు తెలియజేస్తూ... ఈరోజు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు మేరకు ప్రతినెల నాలుగో బుధవారం నిర్వహించే పార్లమెంటరీ స్థాయి సమీక్ష సమావేశంలో మనమంతా ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందని,ఈ సమావేశం కేవలం సమీక్ష కోసమే కాదు, ప్రజలకు మరింత మెరుగైన సేవ అందించడానికి మన కార్యాచరణను మరింత బలోపేతం చేసుకునే అవకాశమని, ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోంది. ఆ ప్రభుత్వ లక్ష్యాలు ప్రజల వద్దకు చేరేలా చేయడం మన అందరి బాధ్యతని, గ్రామం నుంచి మండలం, నియోజకవర్గం వరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం అనుసంధానంగా పనిచేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఇది కేవలం ఒక ఎన్నికల ప్రక్రియ కాదని, ప్రతి అర్హులైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించే ప్రజాస్వామ్య బాధ్యతని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలని, తప్పులు ఉంటే సరిదిద్దేందుకు ప్రజలకు సహాయం చేయాలని, ఈ కార్యక్రమంలో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం ఈ మూడు అంశాలను సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్లాలని, అలాగే ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటేనే పార్టీపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందన్నారు. మనందరం సమన్వయంతో, క్రమశిక్షణతో, సేవాభావంతో పనిచేసి పార్టీని బలోపేతం చేసి మరింత ముందుకు తీసుకువెళ్తూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన కోసం అహర్నిశలు కృషి చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

## భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభ తేది త్వరలోనే ప్రకటన



విశాఖపట్నం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త కిషోర్ అన్నారు. విశాఖ- భోగాపురం ఎయిర్పోర్టు అనుసంధానానికి సంబంధించి 7 రోడ్లలో ఐదింటిని పూర్తి చేసినట్లు చెప్పారు. విశాఖ నుంచి డెడికేటెడ్ ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. “ఎయిర్పోర్టు కోసం డెడికేటెడ్ బస్ బే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, విశాఖ ఎయిర్పోర్టు కొనసాగుతుందనీ, దాని కార్యకలాపాలు మాత్రం భోగాపురం నుంచి నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

## మన్యంలో పెరుగుతున్న విష జ్వరాలు

మన్యం (చైతన్యరథం): వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్రంలో కాలానుగుణ వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నాయి. దోమల పెరుగుదల, కలుషిత నీరు, పారిశుద్ధ్య సమస్యలు, ఫాగింగ్, ఫీవర్ సర్వేలు సక్రమంగా లేకపోవడంతో మలేరియా, డెంగీ, గన్యా వంటి వ్యాధులు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

**గిరిజన ప్రాంతాలపై తీవ్ర ప్రభావం :** అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మలేరియా తీవ్రరూపం దాల్చింది. అనంతగిరి మండలం చిలకలగెడ్డ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కొర్రా సంజు, సీతంపేట మండలం మల్లి పీటీజీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి దివాకర్ జ్వరంతో మృతి చెందడం కలకలం రేపింది. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో జ్వరాలతో ఆసుపత్రులకు చేరుతుండటం గిరిజన కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో జ్వరాల విజృంభణతో ఆసుపత్రులకు తాకిడి పెరిగింది.

# టెక్కలిలో విరుచుకుపడుతున్న వీధి కుక్కలు

**● అధికారులు చర్యలు తీసుకోవాలని : అచ్చెన్నాయుడు**



టెక్కలి (చైతన్యరథం): రోజు రోజుకు వీధిలో కుక్కల సంఖ్య ఎక్కువగా పెరిగిపోతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలో వీధికుక్కలు ఒక్కసారిగా విరుచుకపడి తీవ్ర కలకలం సృష్టించాయి. శుక్రవారం సాయంత్రం వేళ కుక్కలు గుంపులుగా చేరి స్థానికులను హడలెత్తించాయి. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే ఏకంగా 28 మందిని కరిచి గాయపరిచాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే వణికిపోతున్నారు.

**లక్ష్యంగా చేసుకుని దాడులు:** శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య ఈ దాడులు జరిగాయి. ప్రధానంగా రోటరీనగర్ ప్రాంతంలో బాధితులు ఎక్కువగా కుక్కకాటు బారిన పడ్డారు. దీనితో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్, అయ్యప్పనగర్, భవానీనగర్ పరిసర ప్రాంతాల్లోనూ కుక్కలు బీభత్సం సృష్టించాయి. కారు నుంచి దిగుతున్నవారిని, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళుతున్నవారిని వెంబడించి మరీ కరిచాయి. రోటరీనగర్‌లో ఇంటి బయట కూర్చున్న ఓ మహిళపై వెనుక నుంచి దాడి చేసి, గోళ్లతో రక్కి తీవ్రంగా గాయపరిచాయి. బాధితుల్లో ఒక గర్భిణి కూడా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గాయపడిన వారందరినీ వెంటనే స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు.

**మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం:** ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. పంచాయతీ, పశుసంవర్ధక శాఖ అధికారుల నిర్లక్ష్య తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధికుక్కల నియంత్రణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో ఫోన్లో మాట్లాడి, ఆసుపత్రిలో ఉన్న బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. మంత్రి ఆదేశాలతో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి వెంటనే జిల్లా ఆసుపత్రికి చేరుకుని, బాధితులను పరామర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

## ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు



రాష్ట్ర తీరప్రాంతం నుంచి మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించిన వేళ పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంపై ప్రభావం చూపుతున్న ద్రోణి కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక చోట్ల వాననీటితో రహదారులు జలమయం అవుతున్నాయి. మరోవైపు వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**రాజమహేంద్రవరంలో ఏకధాటిగా వాన :** ఉపరితల ద్రోణి ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో అనేక చోట్ల తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. రాజమహేంద్రవరంలో ఏకధాటిగా వాన కురవడంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. గండేపల్లి, తొండంగి, తాళ్లరేవులోనూ వర్షం పడుతోంది. వరుణుడు కరుణించడంతో పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

మద్రులో వర్షం బీభత్సం : కృష్ణా జిల్లా పామర్రులో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. వర్షం ప్రభావానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయం గదుల్లోకి వర్షపు నీరు చేరింది. పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వంతెనలు, రహదారులపై నుంచి నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం :** మచిలీపట్నంలో తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి పూర్తిగా ప్రధాన రోడ్లు నీట మునిగాయి. మోకాలు లోతు వర్షపు నీటిలోనే ప్రజలు ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆర్టీసీ బస్టాండ్ జలదిగ్బంధమైంది. కోనేరుసెంటర్ చెరువును తలపిస్తోంది. వర్షపునీరు తొలగించే ప్రయత్నాల్లో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు.

## స్వదేశానికి చేరుకున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం):నియోజకవర్గ అభివృద్ధికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని, రాజకీయ కక్ష సాధింపులు తమ లక్ష్యం కాదని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఆయన శనివారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు. ఈ నెల 6వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లిన ఆయన, పర్యటన అనంతరం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు . అనంతరం ర్యాలీ గా తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తనపై నమోదు చేసిన తప్పుడు కేసుల కారణంగా దాదాపు 20 నెలల పాటు కోర్టుల చుట్టూ తిరిగి కోర్టు అనుమతి లభించిన తర్వాతే అమెరికా వెళ్లానని తెలిపారు. అమెరికాలో ఉన్న సమయంలో కూడా గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం కృషి చేశానని అన్నారు. పోలవరం కుడి కాలువ-- ఏలూరు కాలువ అనుసంధానానికి రూ.38 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుతో రైతులకు శాశ్వత సాగునీటి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు గన్నవరం ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి దాదాపు 750 రోజుల్లో కేవలం 30 రోజులే నియోజకవర్గానికి దూరంగా ఉన్నానని, మిగతా సమయం మొత్తం ప్రజల మధ్యే ఉండి అభివృద్ధి కోసం పనిచేశానని చెప్పారు. రాజకీయాల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, గన్నవరం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే మూడు అమలు చేశామని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. మల్లవల్లి పారిశ్రామిక వాడకు ఊతమిచ్చి వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అశోక్ లేలాండ్ ప్రాజెక్ట్ పునరుద్ధరణతో పాటు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో 12 సంవత్సరాల తర్వాత రైతులకు ఉచితంగా మట్టి అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గన్నవరం ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, అభివృద్ధే తమ లక్ష్యం అని అన్నారు. విమానాశ్రయానికి వచ్చి ఘన స్వాగతం పలికిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు

**●అనకాపల్లిలో హాస్టల్‌లో సీట్లకు డిమాండ్... ఎంపీ, ఎమ్మెల్యేలతో రికమండేషన్**

**●హాస్టల్‌లో సీటు కోసం పిల్లలు, తల్లిదండ్రులు క్యూ**




ఆంధ్రప్రదేశ్‌లో ట్రెండ్ మారుతోంది.. కొంతకాలంగా ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు కనిపిస్తున్నాయి. సర్కారీ బడులు మాత్రమే కాదు హాస్టల్స్‌లో కూడా అడ్మిషన్ల కోసం పోటీ పెరిగింది. అనకాపల్లి జిల్లాలోని ఆ ప్రభుత్వ హాస్టల్‌లో సీటు అంత ఈజీ కాదు.. ఎంపీ, ఎమ్మెల్యేలతో రికమండేషన్ చేయిస్తారు. కొంతకాలంగా ఈ హాస్టల్‌లో సీటు కోసం పిల్లలు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. అడ్మిషన్లు లేవని అక్కడి సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనక్కు వెళుతున్నారు. దీన్ని బట్టి ఆ హాస్టల్‌లో సీటు కోసం ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

అనకాపల్లిలోని బీసీ బాలుర హాస్టల్‌లో సీటు కోసం తల్లిదండ్రులు క్యూ కట్టారు. ఏకంగా ఎమ్మెల్యే, ఎంపీల లెటర్‌లు ఇచ్చారు.. పిల్లలకు సీటు కావాలంటూ అడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా హాస్టల్‌కు ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు పెరగాయి.. దీంతో సీట్లు సర్దుబాటు చేయడం సిబ్బందికి తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. హాస్టల్‌లో సీట్లు మొత్తం భర్తీ అయ్యాయని.. దయచేసి ఎవరూ రావద్దని సిబ్బంది చెబుతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సు లేఖలతో వచ్చినా ఫలితం లేదని చెప్పి పంపిస్తున్నారు. ప్రభుత్వ హాస్టల్‌లో సీట్ల కోసం డిమాంగ్ పెరగడం ఆసక్తికరంగా మారింది. అనకాపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు 140 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కానీ హాస్టల్‌లో ఇప్పటికే 160 మంది చేరారు. అయినా సరే సీటు కావాలంటూ ఎంపీ, ఎమ్మెల్యే సిఫార్సు లేఖలతో తల్లిదండ్రులు హాస్టల్ దగ్గరకు వస్తున్నారని చెబుతున్నారు.

గతంలో ఈ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరగా.. గత ప్రభుత్వ హయాంలో ఎంపీ నిధులు రూ.20 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎస్ఆర్ కింద ఫైజర్ కంపెనీ రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టింది. హాస్టల్‌కు శ్లాబ్ వేసి, అన్ని రిపేర్లే చేయించి సుందరంగా తీర్చిదిద్దారు. రామ్ కో కూడా సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో రెండు గదుల్ని నిర్మించింది. విద్యార్థులు చదువుకోవడానికి, నిద్రించడానికి గదులు.. మురుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి రోజూ సాయంత్రం ట్యూటర్లతో విద్యార్థులకు బోధనచేయిస్తున్నారు. అంతేకాదు ఈ హాస్టల్‌లో ఉన్న పదో తరగతి విద్యార్థులు 22 మందిలో 21 మంది ఉత్తీర్ణత సాధించారు. అంతేకాదు 21మందిలో ముగ్గురికి 500కిపైగా మార్కులు వచ్చాయి. అనకాపల్లి హాస్టల్‌లో సౌకర్యాలు బావున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.. అందుకే ఈ ఏడాది బీసీ బాలుర హాస్టల్‌లో సీట్లకు డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు.

# పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యం



అరకు (చైతన్యరథం): పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని తహసీల్దార్ రాజ శ్రీధర్ కోరారు. ఈ నెల 28న (ఆదివారం) పల్స్ పోలియో కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా 0- 5 ఏళ్ల వయసు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. అరకు లోయ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో మూడు పీహెచ్సీలు ఉండగా.. గన్నెల పీహెచ్సీ పరిధిలో 29, సుంకరమెట్ట పీహెచ్సీ పరిధిలో 9, మాడగడ పీహెచ్సీ పరిధిలో 22 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మరోవైపు అరకులోయ మండలంలో మొత్తం 58 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# అమరావతిపై గొడ్డలిపార్టీ నిరంతర కుట్రలు : ఎమ్మెల్యే భాష్యం



పెదకూరపాడు (చైతన్యరథం): అమరావతి రైతుల త్యాగాలను వైసీపీ రాజకీయ స్వార్థం కోసం వాడుకోవడం దురదృష్టకరమని టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని కోసం వేలాది మంది రైతులు చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని వారి త్యాగాలను వైసీపీ రాజకీయ స్వార్థం కోసం వాడుకోవడం అత్యంత దురదృష్టకరమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో అమరావతిని నిర్వీర్యం చేసి, రైతులను తీవ్ర మనోవేదనకు గురిచేసిన వారే ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని ఆయన విమర్శించారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, యువత భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రాజధాని రైతుల త్యాగాలు ఏ రాజకీయ పార్టీకి చెందినవి కావని, అవి మొత్తం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేసిన మహోన్నత త్యాగాలని అన్నారు. అలాంటి రైతులను గతంలో అవమానించి, నేడు వారిపట్ల సానుభూతి నటించడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని, దానిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పష్టం చేశారు. రైతుల గౌరవాన్ని కాపాడుతూ, అమరావతి అభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఆయన తెలిపారు.

# ప్రజాదర్బార్ సమస్యలను అడిగి తెలుసుకున్న చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణం చీఫ్ విప్ వారి కార్యాలయం నందు శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జీవీ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కూటమి నాయకులు, తరతరలు పాల్గొన్నారు.

# తల్లికి నేరుగా చెప్పలేని పని జీవితంలో ఎప్పుడూ చేయొద్దు

**●విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**




రాజమహేంద్రవరం (చైతన్యరథం): "తల్లికి నేరుగా చెప్పలేని పని జీవితంలో ఎప్పుడూ చేయొద్దు" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి తమ జీవిత సూత్రంగా మలచుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి నిర్ణయం తీసుకునే ముందు "ఈ విషయం నా తల్లికి ధైర్యంగా చెప్పగలనా?" అనే ప్రశ్నను తమను తాము వేసుకుంటే జీవితంలో తప్పుదారులు పట్టే పరిస్థితి ఎప్పటికీ రాదని ఆయన పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో కూడిన జీవన విధానమే గొప్ప వ్యక్తిత్వానికి, విజయవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. రాజమహేంద్రవరంలోని విజయదుర్గా జూనియర్ కళాశాలలో నిర్వహించిన "మీ భద్రత – మా బాధ్యత" అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ఎంత బలంగా ఉంటే రాష్ట్ర భవిష్యత్తు కూడా అంతే బలంగా ఉంటుందని పేర్కొంటూ... యువత సరైన దిశలో ఎదగడం సమాజ పురోగతికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థి దశ జీవితాన్ని మలిచే అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్న ఆయన, ఈ సమయంలో అలవర్చుకునే క్రమశిక్షణ, విలువలు, అలవాట్లు జీవితాంతం వెంట ఉంటాయని చెప్పారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత ఏ రంగంలో ముందుకు వెళ్లాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకుని దానికి అనుగుణంగా చదువులు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రపంచం వేగంగా మారుతోందని, భవిష్యత్తు పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఉండబోతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువస్తోందని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్, ఇన్ఫోసిస్, టీసీఎస్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ, జాతీయ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న అతిపెద్ద సామాజిక సమస్యల్లో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం ప్రధానమని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎస్ఐఆర్‌పై ఎమ్మెల్యే నసీర్ పరిశీలన



గుంటూరు తూర్పు (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు.. ఈ సందర్భంగా బిఎల్వోలతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితా సరిచూసుకొని ఓట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓట్లర్ల జాబితా ప్రకారం తమ కుటుంబీకులు ఎవరైనా అప్పట్లో ఓట్లు వేసి ఉంటే వారికి అనుకూలంగా ఇప్పటి జాబితాను సరిచూసుకోవాలని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో సోమవారం నుంచి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నామని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో అర్హులైన ఓటర్లను నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఎలా పూర్తి చేయాలో అవగాహన కల్పించాలని చెప్పారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బి యల్ లకు వెంటనే అందజేయాలని ప్రజలకు సూచించారు. అలాంటప్పుడే తమ ఓట్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోగలుగుతారని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను డఉద్యోగులకు సంబంధించి ఒత్తిడి లేకుండా చేపట్టాలని సూచించారు. ఒత్తిడి కారణంగా బిఎల్వోలు తప్పులుగా నమోదు చేసే అవకాశం ఉందని చెప్పారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓటర్లను ప్రస్తుత జాబితాలో తొలగించడమే లక్ష్యంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఎలాంటి అపోహ వద్దని ఎమ్మెల్యే నసీర్ ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓట్లను ఎస్ఐఆర్ లో సరిచూసుకొని నమోదు చూసుకోవాలని చెప్పారు. తమ కుటుంబీకులు ఓటు నమోదు చేసుకొని ఉంటే ఇప్పుడు ఓటు నమోదయ్యే అవకాశం ఉంటుందని సూచించారు.

# పీఏసీఎస్‌లు రైతులకు బహుళ సేవా కేంద్రాలుగా మారాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే రాము, సంఘ సభ్యులతో కలిసి వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్లాంట్‌ను పరిశీలించి నీటి నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమున్నారు. పీఏసీఎస్‌లు కేవలం రుణాలు ఇచ్చే సంస్థలు కాదు, రైతులకు, గ్రామ ప్రజలకు బహుళ సేవలు అందించే కేంద్రాలుగా మారాలన్నారు. కౌతవరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, టీడీపీ నాయకులు వల్లభనేని బాబురావు, చేకూరు జగన్మోహనరావు, బ్యాంక్ చైర్మన్ యుగంధర్, ఈడే కృష్ణ, దేశపతి, కొడాలి రామరాజు, బాబి, తూము పద్మజ, మల్లిపెద్ది సుబ్రమణ్యం, అరసవిల్లి శివ రాజేష్, వల్లభనేని రంగబాబు, జోజి, పిచ్చే ఈశ్వరరావు, గరికిపాటి బ్రదర్స్, సొసైటీ ఉద్యోగులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానం చేసి పలువురికి జీవితం ప్రసాదించడం గొప్ప విషయం

**●చల్లా శివ నరసింహారావు కుటుంబాన్ని అభినందించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): అవయవదానం ద్వారా ఒకరి మరణానంతరం పలువురికి ప్రాణదానం చేయడం అత్యంత గొప్ప మానవతా సేవ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు అబ్దుల్ కలాం నగర్‌కు చెందిన చల్లా శివ నాగరాజు కుటుంబం తీసుకున్న అవయవదాన నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. గుంటూరు అబ్దుల్ కలాం నగర్‌కు చెందిన చల్లా శివ నరసింహారావు మే 31వ తేదీన బుడంపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటనలో, ఆయన భార్య లావణ్య గొప్ప మనసుతో తన భర్త అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. శివ నరసింహ రావు కళ్ళు, కిడ్నీలు, గుండె, కాలేయాన్ని దానం చేయడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులకు కొత్త జీవితం లభించే అవకాశం ఏర్పడింది. ఒక కుటుంబం ఎదుర్కొన్న విషాదం మధ్య కూడా సమాజం పట్ల బాధ్యతతో తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రశంసనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివ నరసింహారావు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, భార్య లావణ్యను ప్రత్యేకంగా అభినందించారు. భర్తను కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ, మరికొందరి జీవితాల్లో ఆశాకిరణాలు నింపేలా అవయవదానం చేయడం గొప్ప త్యాగమని అన్నారు. ఇటువంటి నిర్ణయాలు సమాజంలో మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తాయని చెప్పారు.

# ఓటరు జాబితా నమోదు ప్రక్రియ సజావుగా జరగాలి



ప్రత్తిపాడు (చైతన్యరథం): ఎన్నికల సంఘం మార్గదర్శాల మేరకు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, ప్రత్తిపాడులో బూత్ నెంబర్ 189లో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు ఇంటింటికి వెళ్లి, ఓటర్ నమోదు సవరణల ప్రక్రియను స్వయంగా పరిశీలించి, కుటుంబ సభ్యులకు బూత్ లెవల్ అధికారులతో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనది, అర్హులు ఎవరు ఓటర్ నమోదు కాకుండా మిగిలిపోకూడదని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా సజావుగా సాగేలా చూడాలని అక్కడున్న బిఎల్ఓ మరియు బిఎల్ఎకు తగు సూచనలు చేసి, ప్రతి ఒక్కరినే భాగస్వాములను చేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు బాసటగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే బోడె



పెనమలూరు (చైతన్యరథం): పెనమలూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా నిలుస్తూ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో మరోసారి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. పోరంకిలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే పెనమలూరు నియోజకవర్గంలోని సుమారు 2,200 మంది లబ్ధిదారులకు రూ.20 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి అందజేసి రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేలాది మంది వైద్య సహాయం పొందుతున్నారని ప్రభుత్వం వెల్లడించింది. ఎలాంటి కుల, మత, పార్టీ భేదాలు లేకుండా, ఎవరి వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా పూర్తిగా సేవాభావంతో సహాయనిధి అందజేస్తున్నామని పేర్కొన్నారు, అయినప్పటికీ కొందరు ప్రతిపక్ష నాయకులు చెక్కుల పంపిణీపై అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలు కూడా అత్యవసర వైద్య చికిత్స కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని,అలాంటి కుటుంబాలకు కొంతైనా ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి అందజేస్తున్నామని వివరించారు.

# వృద్ధురాలి రహదారి సమస్యను పరిష్కరించిన యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): ఇంటికి వెళ్లే రహదారికి ఇరువైపులా చెట్లు అల్లుకుపోవడంతో దారిలేక ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు సమస్యకు రెండు గంటల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిష్కారం చూపించారు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో ఓ వృద్ధురాలు ఇంటికి వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న ఇళ్లలో కంపచెట్లు రోడపైకి వాలి రహదారి మూసుకు పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతిని స్థానికులు శనివారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తక్షణమే సమస్య పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ ను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్యదర్శి రమేష్ కంపచెట్ల తొలగించాలని ఇంటి యజమానులకు చెప్పటంతో వారు చెట్లను తొలగించి సమస్యను రెండు గంటల వ్యవధిలో పరిష్కరించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వెంటనే స్పందించి వాటికి పరిష్కారాన్ని చూపిస్తున్నారని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.

# శిక్షణతో పార్టీ మరింత బలోపేతం.. వాస్తవాధారిత రాజకీయాలతో ప్రజల్లో విశ్వాసం పెంచాలి

**●కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమర్థంగా పనిచేయాలి**

**●టీడీపీ శిక్షణా కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా**



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్, యూనిట్ ఇంచార్జిల శిక్షణా కార్యక్రమంలో మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు స్పష్టంగా వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన వెన్నెముక అని ఆయన అన్నారు. కార్యకర్తల పనితీరు, ప్రజల్లో పార్టీ బలం, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం అన్నీ డిజిటల్ విధానంలో నమోదు కావడం ద్వారా పార్టీ మరింత పటిష్టమవుతుందని తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తోందని, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు అందుకు నిదర్శనమని చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి అనే రెండు చక్రాలపై కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రత్యర్థి పార్టీల తీరును వాస్తవాలు, గణాంకాల ఆధారంగా విశ్లేషించి ప్రజలకు వివరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పార్టీ విజయానికి, ప్రజల్లో విశ్వాసం పెంపొందించడానికి ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. భావోద్వేగాలకు అతీతంగా వాస్తవాధారిత రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను బలంగా చాటిచెప్పే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా ఎమ్మెల్యే బొండా ఉమా తనయుడు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ మొగల్రాజపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా, వారి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు సూచన మేరకు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 24వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు గుడ్డేటి మురళి కుమారుడు, కుమార్తె విద్యాభ్యాసానికి రూ.20,000, అలాగే 36వ డివిజన్‌కు చెందిన తడెల చరణ్ అనే విద్యార్థి ఉన్నత విద్య కొనసాగించేందుకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ... విద్యే ప్రతి కుటుంబానికి, ప్రతి సమాజానికి బలమైన పునాది అని అన్నారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల లక్ష్యాలకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో, చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక సంక్షేమ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం పొందిన విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు బొండా ఉమామహేశ్వరరావుకి, బొండా రవితేజకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం

## 56 మందికి 50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవినిగా పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 56 మంది లబ్ధిదారులకు 50,34,141 రూపాయల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి నారాయణ చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 489 మందికి 4,55,33,833 రూపాయల విలువైన చెక్కులను అందజేసి ఆదుకున్నామని మంత్రి వెల్లడించారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా నారాయణ మెడికల్ కాలేజ్ యాజమాన్యం ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి,దంత సురక్ష ద్వారా కేవలం 4 నెలల్లోనే 10 వేల మందికి పైగా వైద్య పరీక్షలు చేసి, ఆరు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు, మరో ఐదు వేల మందికి దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ కల్లా వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. చండీఘర్ తరహాలో నెల్లూరుని గ్రీన్ సిటీ చేస్తానన్నారు.ప్రభుత్వ హైస్కూల్స్ ని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేస్తున్నామన్నారు.అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు విమర్శలు చేస్తున్నారని,సద్విమర్శలు చేస్తే స్వీకరించి సరిచేసుకుంటామన్నారు.ప్రతీది రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూడటం సరికాదని హితవు పలికారు.వైసీపీ నేతలు తీరు మార్చుకోకపోతే జన ఛీత్కారానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, పొట్లూరి రామకృష్ణ,డివిజన్ ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రైతుల చేతిలో వైసీపీ నేతలకు పరాభవం



తిరుపతి (చైతన్యరథం): అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటించేందుకు వచ్చిన వైసీపీ నేతలను రైతులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లపాటు మూడు రాజధానుల పేరుతో అమరావతి అభివృద్ధిని అడ్డుకుని, భూములిచ్చిన రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేతలకు రాజధాని ప్రాంతంలో పర్యటించే నైతిక హక్కు లేదన్నారు. ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ తదితరుల పర్యటనను రైతులు నల్ల బ్యాడ్జీలు, "గో బ్యాక్ వైసీపీ" నినాదాలతో అడ్డుకోవడం ప్రజా ఆవేదనకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1,631 రోజుల పాటు రైతులు, మహిళలు రాజధాని కోసం పోరాడినా వారి సమస్యలను పట్టించుకోకుండా కేసులు, అరెస్టులు, లాఠీచార్జీలతో అణిచివేసిన చరిత్రను ప్రజలు మర్చిపోలేదన్నారు. ఇప్పుడు పరామర్శల పేరుతో అదే ప్రాంతంలో రాజకీయాలు చేయాలని ప్రయత్నించడం ప్రజలను మభ్యపెట్టే చర్యేనని విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేస్తుండటాన్ని జీర్ణించుకోలేక వైసీపీ రాజధాని గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అమరావతి విషయంలో రైతుల సంకల్పమే అంతిమంగా విజయం సాధిస్తుందని గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు.



# వెలుగొండను తెచ్చిన అపర భగీరథుడు

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు

దర్శి (చైతన్యరథం): నియోజకవర్గాన్ని కరువు కోరల నుండి కాపాడేందుకు సాగు తాగునీటి కష్టాలు తీర్చే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తున్న జల ప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దర్శి ప్రాంత ప్రజానీకం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం, గంటవాని పల్లెకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఆమె స్వాగతం పలికి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాలలో భూగర్భ జల మట్టాలు పెరిగేందుకు, తాగు, సాగునీటి అవసరాలు తీర్చే వెలుగొండ ప్రాజెక్టు జూలై 31 నాటికి పూర్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ప్రాంత వాసులందరికీ ఎంతో శుభవార్త అన్నారు. కరువు కోరల్లో వలసలు వెళుతున్న దొనకొండ, కురిచేడు మండలాల రైతాంగానికి ప్రజలకు నిరుద్యోగ యువతకు వెలుగొండ జీవధారగా రూపొందుతుందన్నారు. ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావు కన్న కలలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు.. రైతుల కోసం, రైతుల అభ్యున్నతి కోసం వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న సంకల్పంతో నిర్వాసితులకు నష్టపరిహారం అందించి ప్రాజెక్టును రైతును అంకితం చేస్తున్న సందర్భంగా మనకెంతో ఆనందంగా ఉందన్నారు. దొనకొండ, కురిచేడు, దర్శి మండలాలలో భూగర్భ జలాలు పెరిగి పండ్ల తోటలకు ఎంతో మేలు చేకూర్చే వెలుగొండ ప్రాజెక్టు ఒక వరంగా పేర్కొన్నారు. అంతేగాక తాగునీటి అవసరాలకు వెలుగొండ ఎంతో మేలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. గత ఐదేళ్లు వైసీపీ వెలుగొండను నిర్లక్ష్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్ప బలంతోనీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు వద్దే ఉండి రాత్రనకా, పగలనకా పనులు చేపిస్తూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును అందించడం పనిచేసే ప్రభుత్వంలో పని చేసే నాయకులు ఉంటే ఎలా ఉంటుందని నిరూపించారన్నారు. మరొకసారి ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రులు డోలాబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌కు వెలుగొండను రైతులకు అంకితం చేస్తున్న సందర్భంగా వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.




## కావలి టీడీపీ కార్యాలయంలో

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

కావలి (చైతన్యరథం): కావలి నియోజకవర్గంలో 37వ విడతలో 62 మంది లబ్దిదారులకు రూ.30,79,440 చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేశారు. ఇప్పటివరకు కావలి నియోజకవర్గంలో 1,314 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి అందజేశారు. కావలి నియోజకవర్గానికి మొత్తం రూ.10,39,76,595 ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరయ్యాయి. పేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సహాయం అందిస్తున్న కూటమి ప్రభుత్వం. కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.




# సంక్షేమ పథకాల గురించి మరింతగా ప్రజల్లోకి...

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో 37, 38, 41 వ డివిజన్ల క్లస్టర్ ఇంచార్జ్, మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లస్టర్- 10 సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిపాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆశీస్సులతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 700 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శంకుస్థాపన చేసిన ప్రతీ అభివృద్ధి పనిని పర్యవేక్షించి నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందించడం జరిగింది, స్థానికంగా ప్రజలకు ఏ సమస్య ఉన్న డివిజన్ నాయకులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యాయన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం 2.0, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, మత్స్యకార సేవలో, ఆటో డ్రైవర్ సేవలో మరియు ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. పై కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు యాదవ్, కో క్లస్టర్ ఇంచార్జి విష్ణు ప్రియ, 37వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు టీవన్ శ్రీనాథ్, 38వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో బీఎల్ఏలే చాలా కీలకం

**ఎక్కడా నిర్లక్ష్యం వద్దు, ప్రతి ఇంటికీ వెళ్లేలా నాయకులు చొరవ తీసుకోవాలి, రామగిరి మండల నాయకులకు అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన**



రాప్తాడు (చైతన్యరథం): స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలకమని వారు ప్రతి ఇంటికీ వెళ్లేలా నాయకులు చూడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ అతిథి గృహంలో మండల నాయకులతో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు బీఎల్ఏ లు ఎంత వరకు డోర్ టూ డోర్ పూర్తి చేశారన్నది ఆరా తీశారు. కొన్ని చోట్ల ఇంకా కొందరు ఈ ప్రక్రియను వేగవంతం చేయకపోవడాన్ని ప్రస్తావించారు. మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు ఈ విషయంపై చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 20, 25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందన్నారు. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. వచ్చేనెల 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని.. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్ లో మనకు నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని.. అనర్హులకు తావు లేకుండా చూడాలన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

**టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు**



రాజంపేట (చైతన్యరథం): మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్నమండెం కస్పాలో బాష్యం తీసుకొని ఊరేగింపు గంధపు పీర్లకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొహర్రం త్యాగం, ధర్మ పరిరక్షణ, మానవ సేవ మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. హజ్రత్ ఇమామ్ హుసేన్ చేసిన మహత్యాగం మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు.. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ ఆరీఫుల్లా హుసేనీ ఆశీర్వాదం సుగవాసి ప్రసాద్ బాబు పొందారు.



# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

ధర్మవరం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పరిటాల శ్రీరామ్ తెలియజేశారు. ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణం మరియు రూరల్ లో గల ప్రజలు పలు సమస్యలపై పరిటాల శ్రీరామ్ కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారుల సమస్యలను విన్న పరిటాల శ్రీరామ్ ప్రతి సమస్యకు జవాబుదారితనంగా తెలుగుదేశంపార్టీ ఉంటుందని మీరు ఇచ్చిన ప్రతి సమస్యను పీజీ ఆర్ఎస్ ద్వారా ఆన్లైన్లో ప్రభుత్వానికి అందజేస్తున్నామని ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పరిటాల శ్రీరామ్ ఫిర్యాదుదారులకు తెలియజేశారు.

అదేవిధంగా నియోజకవర్గంలో గల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో పరిటాల శ్రీరామ్ సర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమం జరుగుతున్న తీరుపై పట్టణ,మండలాల వారీగా తెదేపా నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులకు పరిటాల శ్రీరామ్ ప్రత్యేక సూచనలు చేశారు పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సర్ పై నిర్లక్ష్యం వీడి, పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,పార్టీముఖ్య నాయకులు సర్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ఏ ఒక్కరి ఓటు ఓటరు జాబితా నుండి తొలగించకుండా చూడాలని సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రాతిష్టాత్మకంగా తీసుకొని ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ పార్టీ నాయకులకు తెలియజేశారు. ధర్మవరం నియోజకవర్గంలో ఓటరు మ్యాపింగ్ డిజిటలైజేషన్ లో ధర్మవరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో వెనుకబడి ఉందని బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యేటట్లు చూడాలని పరిటాల శ్రీరామ్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

# పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

రాజంపేట (చైతన్యరథం): పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రభుత్వం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఈ మహత్తర కార్యక్రమానికి అందరూ సహకరించి పోలియో రహిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



# మంత్రి లోకేశ్ చొరవతోనే విద్యారంగానికి పునర్వైభవం


**ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నరహరి వరప్రసాద్**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ విద్యారంగంలో స్పష్టమైన సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం గణనీయంగా పెరగడం అత్యంత శుభపరిణామమని మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో లక్షకు పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను విడిచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ఒక సాధారణ గణాంకం కాదని, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని ఆయన అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లేందుకు తల్లిదండ్రులు పోటీ పడితే, నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కోసం ఆసక్తి చూపుతున్న పరిస్థితి ఏర్పడడం విద్యారంగంలో వచ్చిన గొప్ప మార్పుగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం విద్యను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్న నిర్ణయాల వల్లే ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఆయన అన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి, క్రమబద్ధమైన అకడమిక్ మానిటరింగ్, డిజిటల్ సాంకేతికత వినియోగం, ఉపాధ్యాయుల బాధ్యతలను మరింత బలోపేతం చేయడం వంటి చర్యలు ప్రభుత్వ పాఠశాలల పనితీరును గణనీయంగా మెరుగుపరిచాయని పేర్కొన్నారు. నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత కేవలం భవనాల నిర్మాణం లేదా మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాకుండా, విద్యార్థులు నిజంగా నేర్చుకుంటున్నారా లేదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టారని నరహరి వరప్రసాద్ అన్నారు. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి దానికి అనుగుణంగా బోధన అందించే విధానాలు, పాఠశాల పనితీరుపై నిరంతర సమీక్ష, విద్యార్థుల హాజరు పెంపు, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం అత్యంత సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. గతంలో నాణ్యమైన విద్య కోసం అధిక ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అదే కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలలనే విశ్వసించడం ప్రభుత్వ విద్య బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని నరహరి వరప్రసాద్ అన్నారు. ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వారి భవిష్యత్తు మారుతుందని, ఈ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడం వల్ల కేవలం అడ్మిషన్ల సంఖ్య మాత్రమే పెరగడం కాదని, ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం పునరుద్ధరించబడిందనే సందేశం రాష్ట్రవ్యాప్తంగా వెళ్లిందని ఆయన అన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతం అయితేనే ప్రతి కుటుంబానికి ఆర్థిక భారం తగ్గుతుందని, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణలకు ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి తల్లిదండ్రి, ప్రతి ప్రజాప్రతినిధి భాగస్వామి కావాలని నరహరి వరప్రసాద్ పిలుపునిచ్చారు. విద్యారంగంలో ప్రారంభమైన ఈ సానుకూల మార్పులు ఇదే స్థాయిలో కొనసాగితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు దేశానికి ఆదర్శంగా నిలిచే రోజు ఎంతో దూరంలో లేదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దర్పణ: ఏక్ ఇతిహాస్

- ఆగస్టు 15న నర్తన్ అకాడమీ భారీ నృత్య రూపకం
- లైవ్ ఆర్కెస్ట్రాతో అలరించనున్న 100 మంది విద్యార్థులు
- 'సేఫ్ హోమ్' సంస్థకు ప్రదర్శన ఆదాయం విరాళం

**లారెన్స్ (కన్సాస్):** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నృత్య సంస్థ 'నర్తన్ అకాడమీ ఆఫ్ డాన్స్' తమ ప్రతిష్టాత్మక నృత్య రూపకం 'దర్పణ: ఏక్ ఇతిహాస్' (DARPANA: Ek Itihaas -- Reflections of the History of India) ప్రదర్శనకు సర్వం సిద్ధం చేసింది. అమెరికాలోని కన్సాస్‌లో గల ప్రసిద్ధ 'లీడ్ సెంటర్' వేదికగా ఆగస్టు 15న ఈ మెగా ప్రదర్శన జరగనుంది. భారతదేశ ఘనమైన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రదర్శనలో దాదాపు 100 మంది నృత్య విద్యార్థులు, లైవ్ ఆర్కెస్ట్రా (ప్రత్యక్ష సంగీతం)తో కలిసి స్టేజ్‌పై అలరించనున్నారు.




**సామాజిక సేవకు బాసట...**

నర్తన్ అకాడమీ ఈ ప్రదర్శన ద్వారా కేవలం కళను ప్రోత్సహించడమే కాకుండా సామాజిక బాధ్యతను చాటుకుంటోంది. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని స్థానిక సమాజంలో నిరుపేదలు, బాధితులకు ఆసరాగా నిలుస్తున్న ప్రసిద్ధ సేవా సంస్థ 'సేఫ్ హోమ్'కు విరాళంగా అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

ఈ భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేసేందుకు దాతలు, వ్యాపార సంస్థల నుంచి స్పాన్సర్‌షిప్‌లు ఆహ్వానిస్తున్నారు. $100 నుంచి $2,000 వరకు స్పాన్సర్‌షిప్ అందించే వారికి ప్రత్యేక గుర్తింపు, ప్రకటనల అవకాశాలు ప్రీమియం సీటింగ్ కేటాయిస్తారు. ప్రదర్శన విజయవంతం కోసం స్థానిక వ్యాపారవేత్తలు, కమ్యూనిటీ నాయకులు, సంస్థలు భాగస్వామ్యం కావాలని నర్తన్ ప్రతినిధులు కోరారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన టికెట్లు నుఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆసక్తి గల వారు ఈవెంట్ ఫ్లయర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక లింక్ ద్వారా టికెట్లను కొనుగోలు చేయవచ్చు. మన సంస్కృతిని విదేశాల్లో చాటిచెప్తూ స్థానిక సమాజానికి మేలు చేసే ఈ ప్రత్యేక ప్రదర్శనను విజయవంతం చేయడానికి ప్రవాస భారతీయులు, కళాభిమానులు అందరూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ మద్దతుగా నిలవాలని నర్తన్ అకాడమీ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

## కువైట్ లేబర్ మార్కెట్‌లో

# భారతీయుల హవా

### 25.5 శాతం వాటాతో అగ్రస్థానం



**కువైట్:** 'లేబర్ మార్కెట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' తాజా గణాంకాల ప్రకారం 2025లో కువైట్‌లో భారతీయులు అతిపెద్ద వలస కార్మిక వర్గంగా నిలిచారు. దేశవ్యాప్తంగా 5,78,900 మంది భారతీయ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. గృహ కార్మికులను మినహాయిస్తే మొత్తం వలస కార్మిక శక్తిలో వీరి వాటా 25.5%గా ఉంది. 2025లో కువైట్ లేబర్ మార్కెట్ స్థిరంగా విస్తరించిందని ఈ నివేదిక వెల్లడించింది. డిసెంబరు చివరి నాటికి మొత్తం కార్మిక శక్తి 3.04 మిలియన్లకు పెరిగింది. అంతకు ముందు ఏడాది ఇది 2.95 మిలియన్లుగా ఉండేది. 3.3% వార్షిక వృద్ధిని నమోదు చేసింది.

వలస వర్గాల్లో భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా 4,67,900 మంది కార్మికులతో (20.6%) ఈజిప్ట్ తర్వాతి స్థానంలో నిలిచింది. కువైట్ పౌరులు 4,41,200 మంది కార్మికులతో మూడవ స్థానంలో ఉన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, సిరియా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జోర్డాన్ దేశాలు దేశ కార్మిక శక్తిలో మొదటి 10 స్థానాల్లో నిలిచాయి.

2025లో వలస కార్మికుల సంఖ్య 1.83 మిలియన్లకు పెరిగినప్పటికీ, ప్రైవేట్‌రంగ కార్మిక శక్తిలో వారి వాటా స్వల్పంగా తగ్గింది. 2024లో 66.7%గా ఉన్న ఈ వాటా 65.9%కి తగ్గడం... లేబర్ మార్కెట్ కూర్పులో స్వల్ప మార్పును సూచిస్తోందన్నారు.

కువైట్లో ప్రైవేట్ రంగం అతి పెద్ద ఉపాధి కల్పన కేంద్రంగా కొనసాగుతోంది. మొత్తం ఉద్యోగాల్లో 58.8% (సుమారు 1.79 మిలియన్ల మంది కార్మికులు) ఇక్కడే ఉన్నారు. కీలక రంగాల్లో వలస కార్మికుల ఆధిపత్యం కొనసాగుతోంది. వీరిలో దాదాపు సగం మంది హోల్‌సేల్, రిటైల్ వాణిజ్యం (21.4%), నిర్మాణం (14.3%), వసతి, ఆహార సేవలు (12.7%) వంటి రంగాల్లో పనిచేస్తున్నారు.

ప్రభుత్వ రంగంలో.. ముఖ్యంగా అత్యవసర సేవల విభాగంలో వలస కార్మికుల ఉనికిని కూడా ఈ నివేదిక తెలియజేసింది. సుమారు 46,700 మంది వలసదారులు ఆరోగ్య మంత్రిత్వ శాఖలో పని చేస్తుండగా 33,100 మంది విద్యా మంత్రిత్వ శాఖలో ఉపాధి పొందుతున్నారు. కువైట్లోని గృహ కార్మికుల విభాగంలో మొత్తం 7,73,200 మంది కార్మికులు ఉండగా వారిలో 3,10,600 మంది భారతీయులు ఉన్నారు. ఇది ఆ విభాగంలో 40.2% వాటాకు సమానం. 1,37,500 మంది గృహ కార్మికులతో శ్రీలంక రెండో స్థానంలో నిలవగా 1,34,100 మందితో ఫిలిప్పీన్స్ తర్వాతి స్థానంలో ఉంది.

**డబ్లిన్:** కన్న కలలను నిజం చేసుకోవడానికి వయసుతో నిమిత్తం లేదు... సరైన ప్రణాళిక, నిరంతర శ్రమ ఉంటే అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని నిరూపించాడు హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సురాస్ నాయక్. గ్లోబల్ టెక్ దిగ్గజం 'అమెజాన్' సంస్థలో అంతర్గత బదిలీ ద్వారా ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌కు మారి అక్కడ ఏడాదికి దాదాపు రూ.1.35 కోట్ల (1,22,428 యూరోలు) భారీ ప్యాకేజీతో స్థిరపడి వార్తల్లో నిలిచాడు. ఇటీవల ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'CNBC'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం, విదేశాల్లో జీవనశైలి గురించి సురాస్ పంచుకున్న విశేషాలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.




# హైదరాబాద్ టు ఐర్లాండ్

## అమెజాన్‌లో కోటిన్నర ప్యాకేజీ

### యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సురాస్ నాయక్ విజయ గాథ

**ఐఐఐటీ అలహాబాద్ నుంచి బెంగళూరు ఆఫీస్ వరకు...**

సురాస్ తండ్రి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడంతో చిన్నతనం నుంచే అతడికి కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై ఆసక్తి ఏర్పడింది. అలహాబాద్‌లోని ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' (IIIT)లో చదువుకుంటున్న రోజుల్లోనే విదేశాలకు వెళ్లి స్థిరపడాలనే బలమైన కోరిక ఉండేది. కాలేజీ చివరి సంవత్సరంలో అమెజాన్ సంస్థలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసిన సురాస్ 2020లో గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే అదే సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా పూర్తిస్థాయి ఉద్యోగం సంపాదించాడు. బెంగళూరు ఆఫీసులో పనిచేస్తున్న సమయంలో అతని వార్షిక వేతనం దాదాపు రూ.68 లక్షలు ఉండేది.

**పట్టుదలతో అంతర్జాతీయ బదిలీ**

అమెజాన్ సంస్థలో కనీసం రెండేళ్ల అనుభవం పూర్తి చేసుకుని... ఒక నిర్దిష్ట టెక్ లెవెల్‌కు



చేరుకుంటే అంతర్జాతీయ ఆఫీసులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని సురాస్ తెలుసుకున్నాడు. వెంటనే యూకే, జర్మనీ, ఐర్లాండ్‌లలోని అమెజాన్ ఆఫీసుల్లో ఖాళీల కోసం అన్వేషించి టెక్ రంగం వేగంగా విస్తరిస్తున్న ఐర్లాండ్‌ను ఎంచుకున్నాడు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ చాటి 2025 మార్చిలో డబ్లిన్ ఆఫీసుకు బదిలీ అయ్యాడు. వీసా, రవాణా, తాత్కాలిక వసతి ఖర్చులన్నింటినీ అమెజాన్ సంస్థే భరించింది.

**ఖరీదైన డబ్లిన్ జీవితం.. బడ్జెట్ ప్రణాళికలు..**

హైదరాబాద్, బెంగళూరు నగరాలతో పోలిస్తే డబ్లిన్‌లో జీవన వ్యయం (Cost of Living) చాలా ఎక్కువని సురాస్ తెలిపాడు. ప్రస్తుతం ఇద్దరు సహోద్యోగులతో కలిసి ఉంటున్న 3 BHK ఇంటి మొత్తం అద్దె నెలకు 4,000 యూరోలు (సుమారు రూ.4.4 లక్షలు) కాగా అందులో సురాస్ వాటా 1,450 యూరోలు. ఐర్లాండ్‌లో నిత్యావసరాలు, ఇంటి అద్దెలు, హోటల్ భోజన ఖర్చులు అధికంగా ఉండడంతో భారతదేశంలో ఉన్నప్పుడు ఎన్నడూ ఆలోచించని విధంగా ఇప్పుడు ప్రత్యేకంగా 'నెలవారీ బడ్జెట్' వేసుకుని జీవిస్తున్నట్టు చెప్పాడు.

**చిన్న వయసులోనే కోట్లలో పెట్టుబడులు...**

విదేశాలకు వెళ్లడమే కాకుండా ఆర్థిక క్రమశిక్షణతో సురాస్ తన 25వ ఏటనే (2023లో) హైదరాబాద్‌లో రూ.1.6 కోట్ల విలువైన 3BHK అపార్ట్‌మెంట్‌ను పెట్టుబడిగా కొనుగోలు చేశాడు. రాబోయే 10 నుంచి 15 ఏళ్ల పాటు విదేశాల్లోనే కొనసాగుతూ అంతర్జాతీయ అనుభవాన్ని గడించాలని, తన నెట్ వర్త్ (ఆస్తి విలువ) కనీసం ఒక మిలియన్ యూరోలకు (దాదాపు రూ.9 కోట్లు) చేరిన తర్వాతే తిరిగి భారతదేశానికి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్పష్టం చేశాడు. మొదట్లో వాతావరణం, ఒంటరితనం ఇబ్బంది పెట్టినా... Meetup యాప్ ద్వారా కొత్త స్నేహితులను సంపాదించుకుని ప్రస్తుతం డబ్లిన్‌లో అత్యుత్తమ జీవన ప్రమాణాలను (Quality of life) ఆస్వాదిస్తున్నానని సురాస్ సంతోషం వ్యక్తం చేశాడు.

# సీషెల్స్ దేశంలో ప్రధాని మోదీ మూడురోజుల పర్యటన



## ఆ దేశ స్వర్ణోత్సవాల్లో జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు రోజుల పాటు సీషెల్స్ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. సీషెల్స్ జాతీయ దినోత్సవంలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఈ ఏడాది స్వర్ణోత్సవ వేడుకలు జరగడంతో ఈ పర్యటన మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. సీషెల్స్ భారతదేశానికి అత్యంత విలువైన సముద్ర సరిహద్దు పొరుగు దేశమని, భారతదేశం చేపట్టిన 'మహాసాగర్ విజన్'లోనూ, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలోనూ కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, సముద్ర భద్రతా సహకార అంశాలపై వీరు చర్చించే అవకాశం ఉంది. అలాగే సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడం గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. సీషెల్స్‌లో నివసిస్తున్న భారతీయ సమాజ ప్రతినిధులను కలుసుకునేందుకు కూడా తాను ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటన భారత్, సీషెల్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు దోహదపడనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు. ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు



## గుజరాత్‌లో ప్రారంభ వేడుకలు, పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హోం మంత్రి అమిత్ షా గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించారు. కోపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

### ఢిల్లీ ఎర్రకోట కారు బాంబు పేలుడు కేసులో

# మరో ముగ్గురు నిందితులపై ఎన్ఐఏ అనుబంధ చార్జ్‌షీట్

ఢిల్లీ ఎర్రకోట కారు బాంబు పేలుడు కేసుపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ మరో ముగ్గురు నిందితులపై అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఈ సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ముజఫర్ అహ్మద్ అలియాస్ ఫరాజ్ అలియాస్ జఫర్‌తో పాటు జమీర్ అహ్మద్ అహంగర్, తుఫెయిల్ అహ్మద్ భట్ పేర్లను చార్జ్ షీట్‌లో పేర్కొంది. నిందితులు ముగ్గురూ జమ్మూకశ్మీర్‌కు చెందిన వారని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. తాజా చార్జ్‌షీట్‌తో ఈ కేసులో మొత్తం నిందితుల సంఖ్య 13కు పెరిగింది. పరారీలో ఉన్న ముజఫర్ అహ్మద్ పిడియాట్రీషియన్ అని ఎన్ఐఏ పేర్కొంది. అతడు ఎండీ కూడా చేశాడని వెల్లడించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న డా. అదిల్ అహ్మద్ రాథార్‌కు డా. ముజఫర్ సోదరుడని తెలిపింది. అల్ ఖైదా అనుబంధ ఉగ్రసంస్థ ఏజీయూహెచ్ వ్యవస్థాపక సభ్యుడని కూడా పేర్కొంది. గతేడాది నవంబర్ 10న ఎర్ర కోట సమీపంలో కారు బాంబు పేలుడుకు కుట్రపన్నిన వారిలో ముజఫర్ కూడా ఒకడని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఈ కేసులో డా. ఉమర్ ఉన్ నబీ, ముజమ్మిల్, డా. అదీల్ అహ్మద్ రాథార్‌తో పాటు ముజఫర్ కూడా ప్రధాన నిందితుడని తెలిపారు. శ్రీనగర్‌లో 2022 జూన్‌లో జరిగిన ఉగ్రవాదుల సీక్రెట్ మీటింగ్‌లో ముజఫర్ పాల్గొన్నాడని, ఆ సందర్భంగానే ఏజీయూహెచ్ ఏర్పాటు చేశారని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనలో వాడిన బాంబు తయారీ, పరీక్ష, నిల్వలో ముజఫర్ కీలక పాత్ర పోషించాడని తెలిపారు. ఫరీదాబాద్‌లో డా. ఉమర్ ఉన్ నబీ, ముజమ్మీల్ ఏర్పాటు చేసుకున్న ఒక సీక్రెట్ కేంద్రంలో ఈ బాంబు తయారీ జరిగిందని చెబుతున్నారు. ఇప్పటికే అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందని, నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని ఎన్ఐఏ అధికారుల తెలిపారు. మరో నిందితుడైన జమీర్ అహ్మద్ అహంగర్ ఏజీయూహెచ్‌కు సహాయకుడిగా పనిచేశాడు. మందుగుండు సామగ్రి, నగదు రవాణాలో కొరియర్‌గా వ్యవహరించాడు. గతంలో లష్కర్ ఉగ్ర సంస్థకు అనుబంధంగా పనిచేసిన తుఫెయిల్ అహ్మద్ పేలుడు పదార్థాలు, ఆయుధాలను సరఫరా చేశాడని ఎన్ఐఏ తన చార్జ్ షీటులో పేర్కొంది.

# దేశంలో ఆగని పరీక్ష పేపర్ల లీకుల పర్వం



దేశంలో పరీక్ష పేపర్ల లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా మహారాష్ట్రలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' టెట్ పేపర్.. పరీక్షకు 24 గంటల ముందే లీక్ కావడం కలకలం రేపింది. ఆదివారం (జూన్ 28) జరగాల్సిన ఈ పరీక్షను పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర పరీక్షల మండలి ఇవాళ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పరీక్షల ప్రక్రియలో పారదర్శకత, నమ్మకత్వాన్ని కాపాడేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు మండలి స్పష్టం చేసింది.

### అర్ధరాత్రి దాడులు, గుట్టురట్టు!

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. థానే రీజియన్ పరిధిలో టెట్ క్వశ్చన్ పేపర్ లీక్ అయినట్లు శనివారం తెల్లవారుజామున పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన భివండీ పోలీసులు ఒక రహస్య స్థావరంపై దాడి చేశారు. అక్కడ కొందరు వ్యక్తులు సీల్డ్ టెట్ క్వశ్చన్ పేపర్ ప్యాకెట్‌కు సంబంధించిన పేజీలను కలిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పరీక్షల మండలి అధికారులను పిలిపించి ఆ పేజీలను అసలు ప్రశ్నపత్రంతో సరిపోల్చి చూశారు. అవి లీక్ అయిన ఒరిజినల్ పేపరేనని తేలడంతో భివండీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### 4.28 లక్షల మంది అభ్యర్థుల భవితవ్యం

రాష్ట్రవ్యాప్తంగా 1,028 కేంద్రాలలో ఆదివారం జరగాల్సిన ఈ పరీక్ష కోసం సుమారు 4.28 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుని, కేంద్రాలకు బయలుదేరే సమయానికి పేపర్ లీక్ కారణంగా పరీక్ష వాయిదా పడడంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురవుతున్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం.. నరకప్రాయం!

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించటం ఎంత ప్రమాదకరమో తెలిపే ఘటన ఒకటి బెంగళూరులో చోటుచేసుకుంది. బైకుపై వెళుతున్న ఓ వ్యక్తి తలపై చెట్టుకొమ్మ విరిగిపడింది. దీంతో ఆ వ్యక్తి షాక్ తగిలినవాడిలా కుప్పకూలిపోయాడు. తలకు బలమైన గాయం కారణంగా కోమాలోకి వెళ్లిపోయాడు. సతీష్ అనే వ్యక్తి తన బైకుపై రాజాజీనగర్ ఏరియాలోని రామమందిర్ రోడ్ ఏరియాలో ప్రయాణించసాగాడు. ఓ చోట చెట్టు కొమ్మ విరిగి అతడి తలపై పడింది. హెల్మెట్ లేకపోవటంతో సతీష్ తలకు తీవ్రగాయం అయింది. దీంతో అతడు కరెంట్ షాక్ తగిలిన వాడిలా బిగుసుకుపోయి రోడ్డుపై కుప్పకూలాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం యశ్వంత్‌పూర్‌లోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. తలకు అయిన గాయం కారణంగా అతడు కోమాలోకి వెళ్లిపోయాడు. మణిపాల్ ఆస్పత్రి డాక్టర్లు ఎమర్జెన్సీ సర్జరీ నిర్వహించారు. దీంతో సతీష్ కోలుకుంటున్నాడు. ఇప్పుడు అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇక, ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. 'వానాకాలం హెల్మెట్ లేకుండా చెట్లు ఉన్న ప్రాంతంలో నడవటం కూడా ప్రమాదమే'..' అతడి అదృష్టం చాలా బాగుంది. లేదంటే ప్రాణాలుపోయి ఉండేవి'.. 'ఇలాంటి సంఘటనలు చూస్తే గుండె ఝల్లుమంటుంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# వైరస్‌లపై అంతర్జాతీయ ప్రయాణికులు అప్రమత్తం

అంతర్జాతీయ ప్రయాణికులకు భారత ప్రభుత్వం కీలక అలర్ట్ జారీ చేసింది. ఎయిర్ సువిధ 2.0 పోర్టల్‌ను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇకపై అంతర్జాతీయ ప్రయాణికులందరికీ 'హెల్త్ సెల్ఫ్, డిక్లరేషన్' ఫారమ్ తప్పనిసరని అధికారులు స్పష్టం చేశారు. భారతదేశానికి వచ్చే ప్రయాణికులు విమానం ఎక్కడానికి 24 గంటల ముందే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. గత 21 రోజుల ప్రయాణ చరిత్ర, ఆరోగ్య లక్షణాలను పోర్టల్‌లో ఖచ్చితంగా పొందుపరచాల్సిందేనని అధికారులు తెలిపారు. ఎబోలా, బుండిబుగ్యో వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, విమానయాన శాఖలు అప్రమత్తమయ్యాయని వెల్లడించారు. విదేశాల నుంచి వచ్చే వారు ఈ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ వేగంగా పూర్తి కావడానికి ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరని అధికారులు తేల్చిచెప్పారు. ప్రయాణికులకు బోర్డింగ్ సమయంలో, విమానంలోనూ ముందస్తు అలర్ట్ జారీ చేయాలని ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించారు. డౌన్‌లోడ్ చేసిన హెల్త్ డిక్లరేషన్ ఫారమ్‌ను ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద చూపించడం తప్పనిసరని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# వణికిన వెనుజువెలా

- మరో భూకంపం
- ఇప్పటికే రెండు భూకంపాలతో మరుభూమిగా మారిన దేశం
- 1000 మందికి పైగా మృతి, 50 వేల మంది గల్లంతు



జంట భూకంపాలతో వణికిన వెనెజువెలాలో మరోసారి భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.9గా నమోదైంది. ఆ దేశ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రకంపనలు వచ్చాయి. రాజధాని నగరం కారకస్, మరాకే సమీపంలో ఈ ప్రభావం కనిపించడంతో ప్రజలు వణికిపోయారు. మరోవైపు, ఇటీవల సంభవించిన భారీ భూకంపాల కారణంగా 1000 మందికిపైగా మృతి చెందారు. మరో 50 వేల మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ భూ కంపాలతో ఆ దేశానికి రూ. 63వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. బుధవారం సాయంత్రం 7.2, 7.5 తీవ్రతతో క్షణాల వ్యవధిలో రెండు భూకంపాలు రావడంతో వేలాదిమంది శిధిలాల కింద చిక్కుకుపోయారు. వందల భవనాలు కూలిపోవడంతో సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. రెస్క్యూ సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండటంతో.. ఆత్మీయులను కోల్పోయిన వారంతా స్వయంగా చేతులతోనే శిధిలాలను తొలగిస్తున్నారు. ప్రాణాలతో రక్షించడానికి తొలి 48 నుంచి 72 గంటలు కీలకం కావడంతో ఎలాగైనా తమవారిని కాపాడుకోవాలని వారు చేస్తోన్న ప్రయత్నాలతో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం కనిపిస్తోంది.

లా గువేరా రాష్ట్రం జంట భూకంపాలతో తీవ్రంగా ప్రభావితమైంది. రెస్క్యూ సిబ్బంది ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతుండటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎనిమిది అంతస్తుల భవనం కూలడంతో తన ఐదేళ్ల కుమారుడు, మరికొంతమంది బంధువులు చిక్కుకుపోయారని జెన్నిఫర్ అనే మహిళ వాపోయారు. ప్రభుత్వ సహాయం ఆలస్యమవుతుండటంతో స్థానికులే చాలామందిని రక్షించారని, అయితే భారీ కాంక్రీటు స్లాబులు ఎత్తడానికి క్రేన్లు, భారీ యంత్రాల అవసరం ఉందన్నారు.

**దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విపత్తు..**

ఈ ప్రకృతి విపత్తుతో వెనెజువెలాకు ప్రత్యక్షంగా 0.7 బిలియన్ డాలర్ల (రూ.63వేల కోట్ల) మేర నష్టం వాటిల్లిందని ఐరాస అంచనా వేసింది. పరోక్ష ప్రభావాన్నీ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉండొచ్చని అభిప్రాయపడింది. దీంతో ఆ దేశంలో సంభవించిన అత్యంత ఘోరమైన విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే రాజకీయ అస్థిరత, ఆర్థిక సమస్యల కారణంగా వ్యవస్థలు బలహీనపడ్డాయి. ఇప్పుడు విపత్తు కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ.. వారికి ఆశ్రయం కల్పించలేని పరిస్థితి నెలకొంది. భూకంపాల తీవ్రత వల్ల ఇళ్లలోకి వెళ్లలేనివారు కార్లలోనే నిద్రపోతున్నారు. పార్కుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దాదాపు మూడుకోట్ల జనాభా కలిగిన ఆ దేశంలో సగంమందిపైగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. భూకంపాలు రాకముందే 90 లక్షల మంది మానవతా సహాయం అవసరమైన పరిస్థితులున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# హార్మూజ్‌లో నౌకలపై దాడులు

## మరోసారి పెరుగుతున్న ఉద్రిక్తతలు



ఇలా ఉంటే తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై క్షిపణి దాడి జరిగినట్లు యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితం గా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పం దంపై సంతకాలు చేయడంతో హార్మూజ్లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలు గా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమం లోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్లు దాడులను మొదలు పెట్టాయి. డ్రోన్లు, క్షిపణి దాడులతో జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ హార్మూజ్ జలసంధిలో నౌకలపై జరుగుతున్న దాడులు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. ఇటీవల హార్మూజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకపై ఇరాన్‌కు చెందిన డ్రోన్, దాడి చేసినట్టు అమెరికా ఆరోపిం చింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్‌లోని క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, తీర రాడార్ వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ చర్యలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. అమెరికా చర్యలను ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. శాంతి చర్చలు కొనసాగుతున్న సమయంలో ఇలాంటి దాడులు చేయడం అమెరికా నిజమైన ఉద్దేశాలను బయటపెడుతోందని వ్యాఖ్యానించింది.

**ముప్పు పూర్తిగా తొలిగినట్లు కాదు: ట్రంప్**

ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరినంత మాత్రాన ముప్పు పూర్తిగా తొలగిపోయినట్టు కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో మళ్లీ ఘర్షణ మొదలైన నేపథ్యంలో ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పరిస్థితిని అమెరికా నిశితంగా గమనిస్తోందని, అవసరమైతే తక్షణమే స్పందిస్తామని స్పష్టం చేశారు.

అమెరికా దాడుల కారణంగా ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలకు గట్టి దెబ్బ తగిలినా, వారి వద్ద క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసే శక్తి ఇంకా మిగిలి ఉందని ట్రంప్ అన్నారు. అందువల్ల పశ్చిమాసియాలో శాంతి పూర్తిగా నెలకొన్నట్లు భావించకూడదని వ్యాఖ్యానించారు. 'ఇరాన్‌కు ఇంకా సామర్థ్యం ఉంది. అయితే అందంత ఎక్కువేం కాదు. ఎదురుదాడులు చేయగలదనే అనుకుంటున్నా. వాణిజ్య నౌకపై టెహ్రాన్ దాడి తెలివితక్కువ పని' అని ట్రంప్ పేర్కొన్నారు.

కాగా, హింసకు హింసే సమాధానం అవుతుందని ఇరాన్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ ఒప్పందంలో ఏమైనా భేదాభిప్రాయాలు ఉంటే తమకు ఫోన్ చేసి మాట్లాడాలని, ఇలా దాడులు చేయడం సరికాదని సూచించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని గౌరవించాలని పేర్కొన్నారు.


**అమెరికాకే నష్టం: ఇరాన్**

ఒప్పంద ఉల్లంఘన అమెరికాకే నష్టం కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. హార్మూజ్ జలసంధి నుంచి ప్రయాణించే నౌకలు ఇకపై తమ నిబంధనలనే పాటించాలని స్పష్టం చేసింది.

# అఫ్గాన్, పాక్‌ల్లో భూకంపాలు

అఫ్గానిస్థాన్లో భూకంపం సంభవించింది. హిందూ కుష్ ప్రాంతంలో శనివారం సాయంత్రం 6.2 తీవ్రతతో భూమికంపించినట్లు నేషనల్‌సెంటర్ ఫర్ సిస్మాలజీ(ఎన్‌సీఎస్) వెల్లడించింది. ఈశాన్య అఫ్గాన్ లోని కలాఫ్‌గాన్‌కు సుమారు 81 కిలోమీటర్ల దూరంలో ఈభూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. అయితే, ఇది 215 కి.మీ లోతులో సంభవించడం తో ఉపరితలంపై దీని ప్రభావం తక్కువగానే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పాక్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోనూ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5గా నమోదైందని ఎన్‌సీఎస్ తెలిపింది. భూకంపకేంద్రం బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో భూమికి 40 కిలోమీటర్ల లోతులో ఉందని పేర్కొంది. ఈ భూకంపంతో పాక్‌లోని పలు ప్రాంతాల్లో ప్రకంప నలు సంభవించాయి.దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని స్థానిక అధికారులు తెలిపారు. మరోవైపు, ఇదే సమయంలో భారత్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్‌లోనూ పలుచోట్ల ప్రకంపనలు వచ్చినట్లు వార్తలు వస్తున్నా యి. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలను భూ కంపాలు వణికిస్తున్నాయి.గతవారం రోజుల్లోనే వెనెజువెలా,జపాన్,ఫిలిప్పీన్స్,నికరాగువా, అమెరికా దేశాల్లో భూకంపాలు సంభవించి పెనువిషాదాన్ని మిగిల్చాయి.






# వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్–అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ–ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్–అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు.

**మోదీపై ప్రశంసలు..**

ప్రధాని నరేంద్ర మోదీ పై రూబియో ప్రశంసలు కురిపించారు.తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మోదీ మార్చారని కొనియాడారు.

# సూడాన్‌లో అంతర్యుద్ధం..

## భారతీయ కంపెనీ, సీఈవోపై అమెరికా ఆంక్షలు



సూడాన్‌లో ఒక భారతీయ కంపెనీ సహా పలు సంస్థలు, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. సుడాన్‌లో అంతర్యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు అమె రికా ఆర్థికశాఖకు చెందిన ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ వెల్లడించింది. సూడాన్ సాయుధ దళాలు (ఎస్ఏఎఫ్), రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్) మధ్య ఘర్షణ తీవ్రతరం కావడానికి ఈసంస్థలు కారణమవు తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా ఈ రెండు దళాల మధ్యజరుగుతోన్న ఘర్షణలతో సుడాన్‌లో అంతర్యుద్ధం నడుస్తోంది. దాంతో ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం ఏర్పడింది.

ఆంక్షలు ఎదుర్కొంటున్నవారిలో భారత్‌లోని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌కు చెందిన అలోక్ చౌదరీ ఒకరు. ఆయన ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌కు సీఈఓగా ఉన్నారు. దీనికి మరోపేరు అమిన్ ఎక్స్ ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్. సూడాన్‌లో ఎస్ఏఎఫ్‌కు చెందిన ఆయుధాగారాన్ని నిర్వహించే సంస్థకు అమిన్ ఎక్స్ ప్లోజివ్ కంపెనీ పేలుడు పదార్థాలున్న 200 షిప్ మెంట్లను సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌తోపాటు సూడాన్, ఈజిప్ట్ కేంద్రంగా నడుస్తోన్న సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ సంస్థలు సూడాన్ దళాలకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, విదేశీ ఫైటర్లను సరఫరా చేస్తుండటంతో ఘర్షణ సుదీర్ఘకాలంగా కొన సాగుతోంది. దీంతో మానవతా సంక్షోభం ఏర్పడటమే గాకుండా..ఉగ్రవాద గ్రూపులు చెలరేగడానికి అవకాశం ఏర్పడిందని యూఎస్ విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులతో అక్కడ అత్యాచా రాలు, లైంగిక హింస విచ్చలవిడిగా కొనసాగుతున్నా యని గతంలో ఐరాస ఆందోళన వ్యక్తంచేసింది.

స్పోర్ట్స్

చైతన్యరథం

# సిక్సర్ల పిడుగు వైభవ్‌కు చోటు దక్కేనా?

- నేడు ఐర్లాండ్‌తో రెండో టీ 20
- సిరీస్ సమం చేయాలంటే కచ్చితంగా గెలవాల్సిందే

పసికూన ఐర్లాండ్‌ను చుట్టేసి రెండుకు రెండు మ్యాచ్‌లను అవలీలగా గెలిచేస్తుందనుకున్న టీమిండియా ఇప్పుడు సిరీస్‌ను సమం చేసుకుని పరువు నిలబెట్టుకుంటే చాలనే పరిస్థితిలో ఉంది.భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య రెండో టీ 20బెల్‌ఫాస్ట్ వేదికగా ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తేనే సిరీస్ సమం అవుతుంది. రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆరంభ మ్యాచ్‌లో భారత్‌కు ఊహించని పరాభవం ఎదురైంది. బ్యాట్‌తోనూ, బంతితోనూ చెలరేగిన ఆతిథ్య జట్టు.. టీమిండియాను ఉక్కిరిబిక్కిరి చేసింది. పెద్దగా అనుభవం లేని ఆ జట్టు బౌలర్ల చేతిలో మనోళ్లు పూర్తి ఓవర్లను కూడాఆడలేక ఆలౌట్ కావడం గమనార్హం.ఫలితంగా శ్రేయాస్ సేన 34రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. భారత్‌తో ఆడిన తొమ్మిది టీ20ల్లో ఐర్లాండ్‌కిదే తొలి విజయం కావడం గమనార్హం. అలాగే ఈ సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. సిరీస్ విజేతను నిర్ణాయించే రెండో టీ 20లో కచ్చితంగా విజయం సాధించాలని భారత్ పట్టుదలతో ఉంది.

తొలి టీ 20లో భారత్ టీమిండియా సంచలనం వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు లభించకపోవడంపై విమర్శలువచ్చాయి. ఈ మ్యాచ్‌లో టాపార్డర్‌లో శాంసన్ (5), ఇషాన్ (1), మిడిలార్డర్‌లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (3) విఫలం కావటం భారత్‌ను దారుణంగా దెబ్బతీసింది. ఛేదనలో భారత్ కనీసం




150 పరుగులైనా చేయకుండానే ఆలౌట్ అయింది. ఐర్లాండ్ బౌలర్ల ధాటికి పవర్‌ప్లేలోనే ఓపెనర్ శ్రేయాస్ (3)ల వికెట్లను కోల్పోవడంతో ఒత్తిడి పెరిగింది. అయితే ఈ మ్యాచ్లో వైభవ్ ఆడుంటే పరిస్థితి వేరుగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరంభంలోనే ఫోర్లు, సిక్సర్లు బాది ప్రత్యర్థిపై ఒత్తడి పెట్టే ప్రయత్నం చేసేవాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న రెండో టీ20 మ్యాచ్లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు కూడా పెరిగిపోతున్నాయి.

అయితే వైభవ్‌కు తుదిజట్టులో చోటు దక్కాలంటే ఎవరిని తప్పించాలనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. ఒకవేళ వైభవ్ జట్టులోకి వస్తే ఓపెనర్‌గానే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన వైభవ్ కోసం సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మల్లో ఒకరు తమ స్థానాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. ఇక ఈ ఏడాది భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ 321 పరుగులు సాధించి జట్టును గెలిపించాడు. అయితే ఐర్లాండ్తో తొలి టీ20లో మాత్రం శాంసన్ విఫలమయ్యాడు. నాలుగు బంతులెదుర్కొన్న శాంసన్ కేవలం ఐదు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అదే సమయంలో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీతో ఆకట్టుకోవడమే గాక తన స్థానాన్ని మరింత పదిలపరుచుకున్నాడు. మరోవైపు ఇషాన్ కిషన్ కూడా మంచిఫామ్‌లో ఉన్నప్పటికీ ఐర్లాండ్‌తో మ్యాచ్లో విఫలమయ్యాడు. ఐర్లాండ్తో మ్యాచ్లో ఐదు బంతుల్లో కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావాలంటే మాత్రం ఇషాన్ కిషన్ తప్పించడమే తొలి మార్గం. అభిషేక్తో కలిసి వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ వస్తే, సంజూ శాంసన్ వన్ డౌన్లో బ్యాటింగ్‌కు రానున్నాడు. అంతేకాదు శాంసన్ మూడోస్థానంలో మంచి బ్యాటింగ్ రికార్డు ఉంది. శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్‌ను కూడా జట్టులో ఉంచాలనుకుంటే మాత్రం తిలక్ వర్మను తొలగించాల్సిందే. తిలక్ వర్మ ఎక్కువగా మిడిలార్డర్లో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. అయితే చిచ్చర పిడుగు వైభవ్‌కు రెండో టీ 20లో అవకాశం వస్తుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు.

# చరిత్ర సృష్టించిన చిన్న దేశం

## ఫిఫా ప్రపంచకప్ నాకౌట్‌కు కాబో వెర్డె



ఫిఫా ప్రపంచ కప్ 2026లో బుల్లి దేశం కాబో వెర్డె చరిత్ర సృష్టించింది. ఆఫ్రికా ఖండం పశ్చిమ తీరంలో అట్లాంటిక్ సముద్రంలో తేలియాడే, కేవలం 5.30 లక్షల జనాభా కలిగిన ఈ అతి చిన్న ద్వీప సముదాయ దేశం ఇప్పుడు వరల్డ్ కప్ నాకౌట్‌కు చేరుకుని అద్భుతం చేసింది. తొలిసారి ఫిఫా ప్రపంచ కప్ బరిలోకి దిగిన ఈ జట్టు.. ఆడిన మూడు మ్యాచుల్లో ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేదు. అయినా, రౌండ్ 32కు చేరుకొని వార్తల్లో నిలిచింది. గ్రూప్ హెచ్‌లో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లతో కాబో వెర్డె బరిలోకి దిగింది. స్పెయిన్ మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో అగ్రస్థానం సాధించి నాకౌట్‌కు వెళ్లింది. కాబో వెర్డె మాత్రం మూడు డ్రాలు చేసుకుని రెండో స్థానంతో ముందుకు దూసుకెళ్లింది. నాకౌట్లో అర్జెంటీనాతో తలపడనుంది. మరోవైపు స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో ఉరుగ్వే ఓటమిపాలైంది. దీంతో సౌదీ అరేబియాతోపాటు ఉరుగ్వే ఇంటిముఖం పట్టాయి.

### ఫ్రాన్స్ హ్యాట్రిక్ విజయాలు..

### డెంబెలె హ్యాట్రిక్ గోల్స్

ఫిఫా ప్రపంచ కప్లో ఫ్రాన్స్‌కు తిరుగులేకుండా ఉంది. హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్ ఐలో అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరుకుంది. నార్వేతో జరిగిన పోరులో ఫ్రాన్స్ ఆటగాడు ఉస్మాన్ డెంబెలె హ్యాట్రిక్ గోల్స్‌తో మెరిశాడు. ఆట మొదలైన 7వ నిమిషంలో గోల్ కొట్టి ఫ్రాన్సుకు ఆధిక్యం అందించాడు. మళ్లీ 20వ నిమిషంలో గోల్‌తో జట్టు 2-0 లీడ్లోకి వెళ్లింది. అయితే, థెలో అస్గార్డ్ 21వ నిమిషంలో గోలక్ష చేసి నార్వేను రేసులోకి తీసుకొచ్చాడు. కానీ, 32వ నిమిషంలోనే డెంబెలె హ్యాట్రిక్ గోల్ చేయటంతో ఫ్రాన్స్ 3-1 ఆధిక్యం సాధించింది. ఆట మరికాసేపట్లో ముగుస్తుందనగా.. డిసైర్ డౌయ్ గోల్‌తో ఫ్రాన్స్ 4-1 తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇదే గ్రూప్ నుంచి సెనెగల్ 5-0 తేడాతో ఇరాక్‌ను ఓడించింది. దీంతో ఫ్రాన్స్, నార్వే, సెనెగల్ నాకౌట్‌కు దూసుకెళ్లాయి.



# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ సెమీస్‌లో రౌనక్

## - కిదాంబి శ్రీకాంత్, దేవికా సిహాగ్ కూడాజజ

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అదరగొట్టేస్తున్నారు. మహిళలు, పురుషుల విభాగంలో ముగ్గురు ప్లేయర్లు సెమీస్ కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్ లో దేవికా సిహాగ్ విజయం సాధించగా.. పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ సెమీఫైనల్స్‌లో అడుగు పెట్టారు.

### టాప్ ప్లేయర్లను చిత్తు చేసి..

18 ఏళ్ల రౌనక్ చౌహాన్ ఇప్పుడు బ్యాడ్మింటన్ లో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రీ క్వార్టర్ ఫైనల్లో ఆరో ర్యాంకర్‌ను ఓడించిన రౌనక్.. క్వార్టర్స్‌లోనూ దూకుడు కొనసాగించాడు. కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్‌కు చెందిన ఒలింపియన్ ప్లేయర్ మిషా జిల్బెర్మన్‌ను చిత్తు చేశాడు. 23-21, 21-11 తేడాతో విజయం సాధించాడు. దీంతో తొలిసారి మెగా టోర్నీ సెమీస్ లో అడుగు పెట్టాడు.

మరో సింగిల్స్ లో సీనియర్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 21-9, 12-21, 21-8 తేడాతో చైనీస్ తైపీ ప్లేయర్ లియావో జౌపుపై విజయం సాధించాడు. మహిళల విభాగంలో దేవికా 22-20, 21-19 తేడాతో మూడో సీడ్ జపాన్ ప్లేయర్ రికో గున్జాపై గెలిచింది.

# అదరగొట్టిన అకిబ్

## శ్రీలంక-ఏతో తొలి అనధికార టెస్ట్



ఇండియా-ఏ, శ్రీలంక-ఏ మధ్య జరుగుతున్న తొలి అనధికార టెస్టులో శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్ లో వికెట్ నష్టపోకుండా భారత్-ఏ 48 పరుగులు చేసింది. ఆయుష్ పాండే (20), దేవత్ పడిక్కల్ (20) క్రీజులో ఉన్నారు. సాయి సుదర్శన్ (7) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ప్రస్తుతం ఇండియా-ఏ 170 పరుగుల ఆధిక్యంలో ఉంది.

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 113/2తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంక-ఏ 330 పరుగులకు ఆలౌటైంది. నువానిందు (84), అషెన్ బండార(70), సహన్ అరచ్చిగే (72) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో ఆకిబ్ నబీ దార్ (4/58) అదరగొట్టాడు. యశ్ ఠాకూర్, హర్ష్ దూబె రెండేసి, అంశుల్ కాంబోజ్, సారాంశ్ జైన్ చెరో వికెట్ పడగొట్టారు. కెప్టెన్ ధ్రువ్ జురెల్ (141 నాటౌట్; 215 బంతుల్లో) అజేయ సెంచరీ సాధించడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ ఏ 452/6 వద్ద డిక్లేర్ చేసింది.

# అరువు పోల్‌తో జాతీయ రికార్డ్




భువనేశ్వర్ వేదికగా జరిగిన 65వ జాతీయ అంతరాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో కర్నాటకలోని శివమొగ్గకు చెందిన 25ఏళ్ల సింధుశ్రీ పోల్ వాల్ట్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది. అరువు తెచ్చుకున్న పోల్‌ను ఉపయోగించి మహిళల పోల్‌వాల్ట్ 4.25 మీటర్ల ఎత్తును అధిగమించి సింధుశ్రీ చరిత్ర సృష్టించింది.

దీంతో ఇప్పటివరకు ఉన్న 4.23 మీటర్ల జాతీయ రికార్డు బద్దలుకావడమే గాక, 2026 ఆసియా క్రీడల కోసం అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన అర్హత మార్కును సునాయాసంగా అధిగమించిన సింధు శ్రీ ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. ఇటీవలి సంవత్సరాల్లో ఒక భారతీయ పోల్ వాల్టర్‌చేసిన అత్యంత ముఖ్యమైన జంప్స్ లో ఇది ఒకటిగా నిలిచింది. తన సొంతానికి అత్యున్నత ప్రమాణాలతో కూడిన పోల్ అందుబాటులో లేకపోవడంతో, ఆమె ఛాంపియన్ షిప్‌లో పోటీ పడుతున్న మరో అథ్లెట్ నుంచి అరువు తెచ్చుకోవాల్సి వచ్చింది. 4.25 మీటర్ల ఎత్తును ఎలాంటి ఫౌల్ లేకుండా దూకి జాతీయ రికార్డును అధిగమించింది. ఇప్పటివరకు 4.23 మీటర్ల ఎత్తుతో ఉన్న పాత రికార్డును సింధుశ్రీ బద్దలుకొట్టింది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 28 జూన్ 2026 X

# ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47’.. అక్టోబర్ 2న విడుదల



వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47’.. విడుదల తేదీ ఖరారయింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. శ్రీనిధి షెట్టి కథానాయిక. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ విడుదల తేదీ ఖరారైంది. అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మరోనిర్మాత నాగవంశీ తెలిపారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేష్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. గతంలో వెంకటేష్ సూపర్ హిట్ చిత్రాలు ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్ అందిం చారు. వీరిద్దరి కాంబినేషన్లో సినిమా చూడాలని ఎదురు చూసిన ప్రేక్షకులకు ‘ఆదర్శ కుటుంబం’తో ఆ కల నెరవేరనుంది.

ఆదర్శ కుటుంబం హౌస్ నెం.4’ విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ని రిలీజ్ చేసింది.ఆ పోస్టర్‌లో హీరోయిన్ శ్రీనిధి శెట్టి లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. ఆదర్శ కుటుంబం సినిమాలో వెంకటేష్ సరసన మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది శ్రీనిధి శెట్టి. అయితే తాజాగా విడుదలైన పోస్టర్‌లో ఆమెను ఒక సాంప్రదాయబద్ధమైన మధ్యతరగతి గృహిణిగా చూపించడమే కాకుండా, ఆమెకు ఇద్దరు టీనేజ్ వయసున్న పిల్లలు కూడా ఉన్నట్లు చూపించారు. దీనిపై అభిమానులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు సినిమా విశ్లేషకులు మాత్రం త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ స్క్రిప్ట్‌లలో పాత్రల వెనుక ఎప్పుడూ ఒక బలమైన ఎమోషన్, పెద్ద ట్విస్ట్ దాగి ఉంటాయని, శ్రీనిధి శెట్టి కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఒక నటిగా తనను తాను నిరూపించుకోవడానికే ఈ ఛాలెంజింగ్ రోల్‌ను ఒప్పుకొని ఉంటుందని అంటున్నారు.

# తమిళ చిత్రపరిశ్రమలో మరో విషాదం

## నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ కన్నుమూత



తమిళ చిత్రపరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ (73) గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. 75 సినిమాల్లో నటించిన భాగ్యరాజ్ 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. తమిళ దిగ్గజ దర్శకుడు భారతీరాజా (85) ఈ నెల పదో తేదిన తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోకుండానే భాగ్యరాజ్ కన్నుమూశారు.

కె.భాగ్యరాజ్ పూర్తి పేరు కృష్ణస్వామి భాగ్యరాజ్. 1953లో తమిళనాడులో జన్మించిన ఆయన దర్శకులు జి.రామకృష్ణన్, భారతీరాజాలకు అసిస్టెంట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. భారతీరాజా చిత్రాలకు స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. 1979లో ‘సువరిల్లద చిత్తిరంగల్’ అనే తమిళ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. నటి ఊర్వశి, ఆమె సోదరి కల్పనలను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. తమిళ సినిమా ‘16 వెయతినిలె (తెలుగులో పదహారేళ్ల వయసు)’లో తొలిసారి వెండితెరపై కనిపించిన ఆయన.. ఎన్నో చిత్రాలతో అలరించారు.

భాగ్యరాజ్ కేవలం నటుడు, దర్శకుడిగానే గాక, కథా రచయితగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటారు. 1983లో వచ్చిన ఐకానిక్ చిత్రం ‘ముందనై ముడిచ్చు’ (తెలుగులో ‘మూడు ముళ్లు’) చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2014లో సైమా జీవిత సాఫల్య పురస్కారం లభించింది.

ఆయన రాసిన ఎన్నో అద్భుతమైన కథలు హిందీ, తెలుగు వంటి ఇతర భాషల్లో రీమేక్ అయి ఘనవిజయం సాధించాయి. అమితాబ్ బచ్చన్ నటించిన ‘ఆఖరి రాస్తా’, అనిల్ కపూర్ నటించిన ‘వో 7 దిన్’ చిత్రాలకు ఆయనే కథ అందించారు. ఇటీవలే తెలుగులో వచ్చిన ‘35 చిన్న కథ కాదు’, ‘కుబేర వంటి చిత్రాల్లో కూడా ఆయన కీలక పాత్రలు పోషించారు. స్క్రీన్‌ప్లే మాంత్రికుడిగా పేరుగాంచిన భాగ్యరాజ్ మృతి తమిళ చిత్రసీమకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

### చిరంజీవి దిగ్భ్రాంతి

ప్రముఖ దర్శకుడు, నటుడు కె. భాగ్యరాజ్ మృతిపై చిరంజీవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవలే భాగ్యరాజ్‌ను కలిసి మాట్లాడినట్లు తెలిపారు. ఎక్స్ వేదికగా ఆయనను గుర్తుచేసుకుంటూ పోస్టు పెట్టారు. “ఆయన మృతి వార్త విని నా హృదయం ముక్కలైంది. గురువారం ఖుష్బూ కుమార్తె పెళ్లి వేడుకలో మేమిద్దరం కలిశాం. సరదాగా జోకులు వేసుకుంటూ ఫొటోలు తీసుకున్నాం. భాగ్యరాజ్ ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉండేవారు. ఆయన మరణించారనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. టాలెంటెడ్ దర్శకుడు, అద్భుతమైన స్క్రీన్‌ప్లే రచయిత, గొప్ప నటుడు, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి” అంటూ చిరంజీవి విచారం వ్యక్తం చేశారు.

### పవన్ సంతాపం

భాగ్యరాజ్ మృతి పట్ల ఏపీ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.ప్రముఖ దర్శకులు, నటులు, రచయిత కె.భాగ్యరాజ్ కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నా. రచయితగా, సహాయ నటుడిగా సినీ జీవితాన్ని ప్రారంభించిన భాగ్యరాజ్ తమిళ చిత్ర పరిశ్రమలో దర్శకుడిగా, హీరోగా తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రేమ, కుటుంబ కథలను ఆయన మలచిన విధానం ఒక తరం ప్రేక్షకులను మెప్పించింది. భాగ్యరాజ్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని పవన్ పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ ‘రాకా’లో రష్మిక?

‘పుష్ప రాజ్–శ్రీవల్లి’ జోడీ మరోసారి వెండితెరపై కనిపించనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అల్లు అర్జున్, దీపికా పదుకోణే ప్రధాన పాత్రల్లో తమిళ దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న భారీ చిత్రం ‘రాకా’ . ఇందులో రష్మిక నటించనున్నారని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ముంబయిలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్లో రష్మిక కూడా పాల్గొననున్నారట. ‘పుష్ప’లో వీరిద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. రష్మికతోపాటు మృణాల్ ఠాకూర్,జాన్వీ కపూర్ కూడా ఈచిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నట్లు సమాచారం.

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో కనిపించనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ ఏడాది చివరకు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని చిత్ర బృందం భావిస్తోంది.



# ప్రాఫిట్ షేరింగ్ విధానం బెస్ట్..

భారీ స్టార్ల పారితోషకాలపై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు స్పందించారు. తాజాగా ఒక పాడ్ క్యాస్ట్‌లో ఆయన మాట్లాడారు. చిత్రాల మార్కెట్ పరిధి, బిజినెస్ రేంజ్ గురించి తానే స్వయంగా హీరోలకు ముందే స్పష్టత ఇస్తానని, బడ్జెట్ పరిమితులను దాటి పారితోషికాలు ఇవ్వడం తన వల్ల కాదని, తన ఆలోచనలతో సింక్ అయ్యే హీరోలతోనే సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతానని దిల్ రాజు స్పష్టం చేశాడు. ప్రస్తుతం పరిశ్రమలో నడుస్తున్న ట్రెండ్ ప్రకారం.. ఒక రూ. 300 కోట్ల భారీ బడ్జెట్ చిత్రంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు భారీ మొత్తాన్ని కేవలం ఒక హీరో పారితోషికానికే కేటాయించాల్సి రావడం మేకర్స్‌కు పెద్ద తలనొప్పిగా మారిందని దిల్ రాజు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈ క్రమంలోనే ఆయన బాలీవుడ్ చిత్ర పరిశ్రమ అనుసరిస్తున్న సరికొత్త బిజినెస్ మోడల్ మెరుగైన ప్రత్యామ్నాయంగా చెప్పాడు. హిందీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ముందస్తుగా పెద్ద మొత్తంలో క్యాష్ అడ్వాన్స్ రూపంలో తీసుకోవడం కంటే, సినిమా థియేట్రికల్, నాన్–థియేట్రికల్ రన్ ద్వారా వచ్చే నికర లాభాల్లో వాటా తీసుకునేందుకు అక్కడి స్టార్స్ ఆసక్తి చూపుతున్నారని, ఈ తరహా పద్ధతి వల్ల నిర్మాతలకు ఆర్థిక రిస్క్ చాలా వరకు తగ్గుతుందని, ఒకవేళ సినిమా బ్లాక్‌బస్టర్ విజయం సాధిస్తే హీరోలకు కూడా ఊహించని స్థాయిలో లాభాలు వస్తాయని, పొరపాటున ప్రాజెక్ట్ విఫలమైనా మేకర్స్ పూర్తిగా రోడ్డున పడే పరిస్థితి ఉండదని చెప్పుకొచ్చాడు. మన తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఈ తరహా కల్చర్ ఇంకా పూర్తిగా ఊపందుకోలేదని, రాబోయే రోజుల్లో టాలీవుడ్ కూడా ఇదే హెల్తీ బాటలో పయనిస్తేనే పరిశ్రమ ఆర్థికంగా ఎంతో ఆరోగ్యంగా, పటిష్టంగా ఉంటుందని దిల్‌రాజు ఆశాభావం వ్యక్తం చేశాడు.

# ‘ఇడుపు కాయితం’ పేరు మార్చేది లేదు

ఎన్ని వివాదాలు వచ్చినా సరే ‘ఇడుపు కాయితం’ సినిమా పేరు మాత్రం మార్చేది లేదని నిర్మాత బన్నీ వాసు తేల్చిచెప్పారు.ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్ తోనే చర్చకు దారితీసిన మూవీ ‘ఇడుపు కాయితం’. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టి టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు..

ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది. సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా. బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు: నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు.

ప్రాంతాన్ని బట్టి కథ ఉంటుందా? అంటే ఎక్కడో తీసిన హాలీవుడ్ మూవీ ఇక్కడ ఆడదు కదా! ఇది ప్రతి ఇంటిలో ఉండే కథ. క్లైమాక్స్‌కు వచ్చే సరికి అత్తాకోడళ్లు, మామాఅల్లుళ్లు ఒకరి చేయి ఒకరు పట్టుకుని బయటకు వస్తారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ముందు ఆలోచించాలి. విభేదాలు తీసుకురాకుండా జాగ్రత్తగా ఉండాలి.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నటీనటులకు డైలీ రెమ్యునరేషన్స్ ఇచ్చి సినిమా చేయాలంటే కష్టం. అందుకే మేము కొత్త వాళ్లను ప్రోత్సహిస్తున్నాం. నా బడ్జెట్, నా పరిధిలోకి వచ్చే వారితోనే సినిమాలు చేస్తా అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు..

### ‘ఇడుపు కాయితం’ అంటే..

ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి.

